# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 14 సెప్టెంబర్ 2025 | సంపుటి : 9 | సంచిక: 256 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## బెయిల్‌పై 2 నెలల్లో నిర్ణయించాలె

హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచన



2

## నేడు భూ అయస్కాంత తుపానులు



2

• సమస్యలు, సవాళ్లు దాటి..



# సంక్షేమం, అభివృద్ధి ఇస్తున్నాం

• సమస్యలు, సవాళ్లు దాటి.. సంక్షేమం, అభివృద్ధి ఇస్తున్నాం

• సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** జిల్లా ఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏడు జిల్లాలకు ఎస్పీలుగా కొత్త అధికారులని, మరో ఏడు జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి ప్రభుత్వం బదిలీలు చేసింది. 12 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్నవారినే ఎస్పీలుగా కొనసాగించింది. 26 జిల్లాల ఎస్పీలు చంద్రబాబుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు, ఆలోచనలు, లా అండ్ ఆర్డర్ సహా పలు అంశాలపై ఎస్పీలకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

అనంతరం మంత్రులు, సెక్రటరీలతో సీఎం సమావేశం అయ్యారు. 15, 16 తేదీల్లో జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ అజెండా, నిర్వహణపై ముఖ్యమంత్రి చర్చించారు. అధికారుల బదిలీలతో పాలనలో వేగం పెంచే ప్రయత్నాల్లో ముఖ్యమంత్రి ఉన్నారు. మంత్రులు మరింత సమర్ధంగా, ప్రభావవంతంగా పనిచేయాలని సీఎం సూచించారు. సమస్యలు, సవాళ్లు దాటి సంక్షేమం, అభివద్ధి ఇస్తున్నాం.. ఇప్పుడు పాలనలో వేగం పెరగాలంటూ మంత్రులకు, ఉన్నతాధికారులకు సీఎం స్పష్టం చేశారు.

# మీవెంటే ఉంట

## మణిపూర్ హింసాబాధితులతో మోడీ



**ఇంఫాల్, సెప్టెంబర్ 13 :** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటిస్తోన్న ప్రధాని మోడీ.. జాతుల మధ్య ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పూర్ జిల్లాకు చేరుకున్నారు. అక్కడ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారితో మాట్లాడారు. 2023లో ఈ ఘర్షణలు చోటుచేసుకోగా.. రెండేళ్ల తర్వాత పీఎం ఆ రాష్ట్రానికి వెళ్లారు. జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత శనివారం ఆ రాష్ట్రానికి వెళ్లారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపూర్ ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా శరణార్థి శిబిరాల్లో ఉన్న చిన్నారులను పలకరించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఓ చిన్నారి కానుకగా ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని వారికి హామీ ఇచ్చారు. తర్వాత స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ''మణిపూర్ ప్రకృతి ప్రసాదించిన కానుక. ఈ రాష్ట్ర ప్రజలకు తలవంచి నమస్కరిస్తున్నాను. ఇది సాహసవంతులు పుట్టిన నేల. మణిపూర్‌లో కొండలు చాలా అందంగా ఉన్నాయి. పేరులో ఉన్న మణికి అర్థం.. ఈశాన్య రత్నమని. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం. ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగింది. కొత్త ఉషస్సు ప్రారంభం కానుంది. ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. శాంతి చర్చలు మొదలయ్యాయి. నేను మీతో ఉన్నాను. కేంద్రం మీ వెంటే ఉంటుందని హామీ ఇస్తున్నాను. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని కోరుకుంటున్నాను'' అని మోడీఅన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సభకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.


## ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నూతన కోచ్‌గా గ్యారీ స్టీడ్

రంజీ క్రికెట్ సీజన్ 2025-26కు న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్‌ను పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.



2

## 14 జిల్లాలకు కొత్త ఎస్పీలు



2

# జన సైనికులు ఆవేశాలకు లోనై ఘర్షణకు తావీయవద్దు

• డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**అమరావతి, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** రాష్ట్రంలో అభివృద్ధి దిశగా.. సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్న ఈ తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే విధంగా కుట్రలు మొదలయ్యాయని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు జన సైనికులకు పలు సూచనలు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. ''ఇలాంటి కుట్రలకు పాల్పడే వారి పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలి. సామాజిక మాధ్యమాల ముసుగులో, యూ ట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో, మరో మార్గంలోనో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని పదేళ్లుగా చూస్తున్నాం. వారి



ఉచ్చులో పడి, ఆవేశాలకు లోనై, ఘర్షణ వాతావరణానికి తావీయవద్దు. అలా ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి.

**సమస్య జటిలం చేయొద్దు..**

ఇటీవల మచిలీపట్నంలో చోటు చేసుకున్న ఘటనలు ఇందుకు ఉదాహరణ. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో ఒక వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడాడు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి, ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను పసిగట్టాలి. దానిపై చట్ట ప్రకారం కేసులుపెట్టి ముందుకు వెళ్లాలి. తొందరపడి మరో మార్గంలో వెళ్లి ఘర్షణపడటం ద్వారా సమస్య జటిలం అవుతుంది. ప్రజల మధ్య సామరస్య వాతావరణం చెడగొట్టి రెచ్చగొట్టే నాయకులు బయటకు వస్తారు.

**మచిలీపట్నం వివాదంపై పార్టీలో అంతర్గత విచారణకు ఆదేశం**

కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకువచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాలి. ఈ దిశగా ముందుకు వెళ్లాలని జనసేన నాయకులు, శ్రేణులతో పాటు కూటమి.. ...మిగతా 2లో

• ఆపరేషన్ మహాదేవ్

## వీర సైనికులకు కేంద్ర హోం శాఖ సత్కారం

2

## నెల్లూరులో బీ ఫార్మసీ విద్యార్థిని దారుణ హత్య!

**నెల్లూరు, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** ఓ విద్యార్థిని దారుణ హత్యకు గురైన ఘటన నెల్లూరు నగరంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో చోటు చేసుకుంది. బీ ఫార్మసీ ఫైనల్ ఇయర్ పూర్తయిన యువతిని, సదరు విద్యార్థిని స్నేహితుడు కత్తితో పొడిచి చంపేశాడు. మాట్లాడాలని తన గదికి పిలిచి.. ఈ దారుణానికి ఒడిగట్టాడు. అనంతరం, నిందితుడు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.



# హౌజింగ్ ఫండ్ ఏర్పాటు చేయండి

## పన్ను చెల్లింపుదారుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలంటూ కేంద్రానికి సుప్రీం సూచన

**ఢిల్లీ, సెప్టెంబర్ 13 :** పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను



ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక 'నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది.నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్లతో ...మిగతా 2లో

# ఏపీలో ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం..

• మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

**అమరావతి:** ఆటోమిత్ర పథకం కింద దసరా రోజున ఆటోడ్రైవర్ల ఖాతాలో రూ.15 వేల చొప్పున జమ చేస్తామని




ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఈ ఆర్థిక సాయం వర్తించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు పథకం అమలు, అర్హతలు, తదితర.. ...మిగతా 2లో

## కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డా. సిరి బాధ్యతల స్వీకరణ



7

## కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కృషి



బీసీలకు రాజ్యాధికారంలో వాటా సాధించడమే లక్ష్యం

42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు పోవాలె

బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబర్ 13, మనం బ్యూరో:** బీసీలకు రాజ్యాధికారంలో వాటా సాధించడమే తన జీవిత లక్ష్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీల్లో చైతన్యం పెరిగిందనీ, అన్ని రంగాల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బీసీ భవన్‌లో శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు ఘనంగా ...మిగతా 2లో

# కృష్ణా నీటి వాటాలో.. ఒక్క చుక్కా వదులుకోం

## అవసరమైన ఆధారాలన్నీ సిద్ధం చేయండి

## గత ప్రభుత్వం కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం చేసింది

## 23 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ ఫైనల్ హియరింగ్

## ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, సెప్టెంబర్ 13, మనం బ్యూరో:** కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే... తెలంగాణ రాష్ట్రానికి చెందాల్సిన నీటివాటాలో ఒక్క చుక్క కూడా వదులుకునేది లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి ఉత్తమ్, సాగునీటి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని అధికారులను ఆదేశించారు. ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్ధవంతంగా వాదనలు వినిపించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రైబ్యునల్ ముందు ఉంచాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలనీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ..

...మిగతా 2లో

## కృష్ణా జలాల్లో 71 శాతం వాటా సాధిస్తం

2

## భారత్‌పై సుంకాల విధింపునకు జీ7 అంగీకారం?

### ట్రంప్ ప్రతిపాదనలకు ఓకే చెప్పిన సంపన్న దేశాలు




**వాషింగ్టన్, సెప్టెంబర్ 13 :** ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే నెపంతో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను ట్రంప్ లక్ష్యంగా చేసుకున్న విషయం పాఠకులకు విదితమే. ఈక్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనాలపై టారిఫ్లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

జీ7 దేశాల ఆర్థిక మంత్రులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య టారిఫ్‌ల ...మిగతా 2లో

## పాలస్తీనాకు ప్రత్యేక దేశ ప్రతిపత్తి

### ఐరాస తీర్మానానికి భారత్ మద్దతు

**న్యూయార్క్, సెప్టెంబర్ 13 :** పాలస్తీనాకు సంపూర్ణ దేశ ప్రతిపత్తి కల్పించాలంటూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సభ చేసిన తీర్మానానికి భారత్ శుక్రవారం మద్దతు తెలిపింది. 193 సభ్యులు కలిగిన సర్వసభ్య సభలో భారత్‌తో సహా 142 దేశాలు ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటేశాయి. 10 దేశాలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించడంతోపాటు ఇజ్రాయెల్, పాలస్తీనాలు తమ మధ్య ఉన్న వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్న న్యూయార్క్ డిక్లరేషన్ ను తీర్మానం సమర్థించింది.

# సుశీలా కర్కిది 'యాప్' ఎన్నిక!

### డిస్కార్డ్ యాప్లో లక్ష మంది ఓటింగ్..

**ఖాట్మండు, సెప్టెంబర్ 13 :** జెన్-జడ్ నిరసనలతో అల్లకల్లోలమైన నేపాల్లో నెమ్మదిగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి శనివారం సైనిక కర్ఫ్యూ ఆంక్షలను ఎత్తివేశారు. శుక్రవారం దేశ తాత్కాలిక ప్రధానిగా సుశీలా కార్కీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఈ



పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఆమె ఎంపిక అంతా ...మిగతా 2లో

## మార్చి 5న పార్లమెంటు ఎన్నికలు

2

### మోడీ అభినందన

నేపాల్ తొలి మహిళా ప్రధాన మంత్రిగా నియమితులైన సుశీల కర్కికి ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఒక ఉజ్వల ఉదాహరణ అని అన్నారు. నేపాల్ భారత్ కు సన్నిహిత దేశమని, 140 కోట్ల భారత ప్రజానీకం తరపున ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నానని మణిపూర్ రాజధాని ఇంఫాల్లో మాట్లాడుతూ ప్రధాని అన్నారు.

## జన సైనికులు ఆవేశాలకు లోనై ఘర్షణకు తావీయవద్దు



(మొదటి పేజీ తరువాయి)

నాయకులకు సూచిస్తున్నాను. సోషల్ మీడియా, యుట్యూబ్ ఛానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారిని, అభ్యంతరకర రీతిలో మాట్లాడేవారిని చట్టం ముందు నిలపాలి. వీరి వెనక ఉండి వ్యవస్థీకతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసే వారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాలి. మచిలీపట్నం వివాదంపై పార్టీలో అంతర్గత విచారణ చేయాలని నాయకులకు ఆదేశాలు ఇచ్చాను. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని సూచించా. కుట్రలు చేసేవారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్యయుతంగా, చట్ట ప్రకారమే తిప్పికొడదాం'' అని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ సూచించారు.

## 14 జిల్లాలకు కొత్త ఎస్పీలు

**అమరావతి:** ఏపీలో 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. 7 జిల్లాలకు కొత్త అధికారులను నియమించగా.. మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ చేశారు. 12 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్నవారినే ఎస్పీలుగా కొనసాగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ- రాహుల్ మీనా
బాపట్ల- ఉమామహేశ్వర్
కష్ణా- విద్యాసాగర్ నాయుడు
నెల్లూరు- అజితా వేజెండ్ల
తిరుపతి- సుబ్బరాయుడు
అన్నమయ్య- ధీరజ్ కునుగిలి
కడప- నచికేత్
గుంటూరు- వకుల్ జిందాల్
నంద్యాల- సునీల్ షెరాన్
విజయనగరం- ఏఆర్ దామోదర్
పల్నాడు- డి.కష్ణారావు
ప్రకాశం- హర్షవర్ధన్ రాజు
చిత్తూరు- తుషార్ డూడి
శ్రీసత్యసాయి- సతీష్ కుమార్

## హౌజింగ్ ఫండ్ ఏర్పాటు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది. రెరాను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఓ సంస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

## బెయిల్‌పై 2 నెలల్లో నిర్ణయించాలె

### హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచన

**ఢిల్లీ, సెప్టెంబర్ 13 :** రెగ్యులర్, ముందస్తు బెయిల్ పిటిషన్లపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం అన్ని హైకోర్టులకు సూచించింది. బెయిల్ పిటిషన్లను దీర్ఘకాలం పాటు పెండింగ్లో పెట్టడం న్యాయాన్ని నిరాకరించడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై అన్ని జిల్లా కోర్టులకు సూచనలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన పిటిషన్లను సంవత్సరాల తరబడి 'అనిశ్చితి మేఘాల్లో' ఉంచడం సరికాదని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ల ధర్మాసనం అభిప్రాయపడింది. కేసులోని మెరిట్ ఆధారంగా త్వరగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అందువల్ల పిటిషన్ దాఖలయిన 2 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసులపై దర్యాప్తు సంస్థలు కూడా త్వరగా విచారణలను ముగించాల్సి ఉంటుందని తెలిపింది. బెయిల్ పిటిషన్లు పేరుకుపోకుండా హైకోర్టులు తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సూచించింది. ఫోర్జరీ, మోసం కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించిన బాంబే హైకోర్టు ఆదేశాలను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్య చేసింది. బెయిల్ పిటిషన్ను దీర్ఘకాలంగా పెండింగ్లో పెట్టడాన్ని గుర్తించి అలా చేయకూడదని సూచనలు ఇచ్చింది.

## ఎయిర్‌పోర్టు 86 శాతం పూర్తయింది

● రామ్మోహన్ నాయుడు



**విజయనగరం:** భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులు 2026 జూన్‌లో ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. విమానాశ్రయ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతి, పూర్తికావాల్సిన నిర్మాణాలు, తదితర అంశాలపై నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ని సవాళ్లు ఎదురైనా జీఎంఆర్ సంస్థ పనులు ఆపడం లేదన్నారు. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 86 శాతం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయిందని చెప్పారు. విశాఖ నుంచి రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి అనేక సార్లు సమీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 7 పాయింట్లు గుర్తించామని చెప్పారు. ''మార్చి, ఏప్రిల్‌లోగా ఈ రహదారి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. శ ఎలివేటెడ్ కారిడార్ కూడా ప్రతిపాదనలో ఉంది. బీచ్ కారిడార్ నిర్మాణం కోసం కూడా డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. విశాఖ నుంచి కొచ్చికి కనెక్టివిటీ కోసం వినతులు వచ్చాయి. విశాఖ నుంచి అంతర్జాతీయ కనెక్టివిటీ పెంచేందుకు దష్టి సారించాం.'' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## ఏపీలో ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం..

(మొదటి పేజీ తరువాయి)

వివరాలతో ఆదేశాలు జారీ చేసింది. బీమా, ఫిట్‌నెస్, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ఈ ఆర్థిక సాయం చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు.


**మార్గదర్శకాలు ఇవే..**

లబ్ధిదారులు సొంత వాహనం, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.
లబ్ధిదారులు తమ వాహనానికి ఏపీ రిజిస్ట్రేషన్, ఫిట్ నెస్, టాక్స్ చెల్లింపు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి.
మూడు, నాలుగు చక్రాల సరకు రవాణా వాహనాలకు పథకం వర్తించదు.
లబ్ధిదారుడు తప్పని సరిగా ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలి.
కుటుంబంలో ఒకవాహనదారుడికి మాత్రమే పథకం వర్తింపు.
లబ్ధిదారుల ఎంపిక , పథకం అమలు కోసం చర్యలు చేపట్టనున్న గ్రామ వార్డు సచివాలయాలు, రవాణాశాఖ.
ఈనెల 17 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ.
ఈ నెల 24 నాటికి దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల తుది జాబితా సిద్ధం చేయనున్న ప్రభుత్వం
అక్టోబర్ 1న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేయనున్న ప్రభుత్వం

## ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నూతన కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) రంజీ క్రికెట్ సీజన్ 2025-26కు న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్‌ను పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమించింది. రాష్ట్ర స్థాయి క్రికెట్ అసోసియేషన్ విదేశి క్రికెటర్‌ను కోచ్ గా నియమించడం ఇదే ప్రథమమని ఏసీఏ ప్రతినిధు లు తెలిపారు. రాష్ట్రంలో క్రికెట్‌ను ప్రోత్సహించే క్రమం లో నైపుణ్యామైన శిక్షణను అందించి అంతర్జాతీయ క్రికె ట్ మ్యాచ్‌లో రాష్ట్ర ప్లేయర్స్‌కు స్థానం దక్కాలన్న ధ్యేయంతో ఈ నియామకం చేపట్టామని ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఒక ప్రకటనలో తెలిపారు. న్యూజిలాండ్ క్రికెట్ జట్టు కోచ్‌గా ఆయన పదవీకాలం ముగియడంతో ఏసీఏ ప్రధాన కోచ్‌గా నియమించినట్టు చెప్పారు. గ్యారీ స్టీడ్ అన్ని ఫార్మాట్లలో అద్భుత పనితీరు ట్రాక్ రికార్డు కలిగి ఉన్నాడని, ఆయన నాయకత్వం ఏసీఏ క్రికెట్ ప్లేయర్స్‌లో పోటీతత్వాన్ని పెంచుతుందని తెలిపారు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు మాట్లాడుతూ.. గ్యారీ నియామ కం ఆంధ్ర క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందన్నారు.

## మార్చి 5న పార్లమెంటు ఎన్నికలు



2026 మార్చి 5న పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. నూతన ప్రధాని కార్కీ సిఫార్సు మేరకు దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు.

## భారత్‌పై సుంకాల విధింపునకు జీ7 అంగీకారం?

(మొదటి పేజీ తరువాయి)

విధింపుపై చర్చ జరిగింది. ఈ చర్చకు సంబంధించిన విషయాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. 'ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకురావాలని యూఎస్ వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారు. ఇందుకోసం మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదనలను ఉద్ఘాటించారు. ఇప్పటికే.. భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని అక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామంటూ జీ7 సభ్యదేశాలు అమెరికాకు హామీ ఇచ్చాయి. ఈ క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఈ దేశాలు కూడా నిర్ణయాత్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నాం' అని జామిసన్ గ్రీర్ తన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమైన విషయం ఇక్కడ గమనార్హం.

## సుశీలా కర్కిది 'యాప్' ఎన్నిక!

(మొదటి పేజీ తరువాయి)

ఆన్ లైన్‌లో జరగడం విశేషం. డిస్కార్డ్ యాప్‌ను వినియోగించుకొని ఆ దేశ యువత ఆమెను ఎంచుకున్నారని మీడియా కథనాలు వెల్లడించాయి.

2015లో జాసన్ సిట్రాన్, స్టానిస్లావ్ విష్నేస్కీ ఈ డిస్కార్డ్ యాప్‌ను ఆవిష్కరించారు. తొలుత దీనిని గేమర్స్ కోసం రూపొందించారు. తర్వాత గేమ్స్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చాటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. దాంతో 2016 నాటికి ఆ యాప్ 25 మిలియన్లకు పైగా ఫాలోవర్లను సొంతం చేసుకుంది. ఇక కరోనా సమయంలో అది మరింత ఆదరణను దక్కించుకొంది. ముఖ్యంగా జెన్-జడ్ యూజర్లను ఇది ఆకట్టుకుంది. గేమింగ్ పైనే కాకుండా యూజర్ల ఆసక్తికి అనుగుణంగా మరిన్ని డిస్కార్డ్ సర్వర్లు ఏర్పాటయ్యాయి. ఇప్పుడది కమ్యూనికేషన్కు వేదికగా మారిపోయింది. సర్వర్లు, ఛానళ్ల ద్వారా వినియోగదారులు చర్చల్లో పాల్గొంటున్నారు. తమ నిరసనల కోసం జెన్-జడ్ యువత ఈ యాప్ పైనే ఆధారపడింది. యూత్ అగైనెస్ట్ కరప్షన్ డిస్కార్డ్ సర్వర్ను ఉపయోగించి సుశీలాకార్కిని వారు ఎంచుకున్నారు. ఈ సర్వర్లో 1.3 లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలుస్తోంది. నేపాల్ తదుపరి నాయకుడిని ఎంచుకోవడానికి ఈ సర్వర్లో పలు పోల్స్ నిర్వహించారు. అయితే, ఆ యాప్ లో ఓటింగ్ లో పాల్గొన్నవారంతా నేపాల్‌కు చెందినవారు కూడా అయ్యుండకపోవచ్చని తెలుస్తోంది. ఆ దేశానికి చెందనివారు కూడా ఓటు వేసే వీలుంటుందని కొన్ని మీడియా కథనాలు వెల్లడించాయి. పూర్తిస్థాయి నాయకుడిని ఎన్నుకునేందుకు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకే ఈ ఓటింగ్ జరిగినట్లు సమాచారం.

## కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కృషి


(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ ఆర్.కృష్ణయ్య పోరాటాల ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుతో బడుగు, బలహీన వర్గాల పేదల పిల్లలు ఉన్నత చదువులు పూర్తి చేసుకున్నారనీ, దీంతో వారు సమాజానికి సేవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకై కృషి చేస్తానని వెల్లడించారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యమనీ, పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన బీసీ విద్యార్థులు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యారంగంలో రాణించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు ర్యాగ అరుణ్, వినయ్ , వినీత్, రాజ్‌కుమార్, రాజేశ్, అంజి, ప్రీతమ్, సతీష్, రాకేశ్, నాగరాజు పాల్గొన్నారు.

## అధికారం కోసమే.. జగన్ మాట మార్పు

● మంత్రి నారాయణ




**విజయవాడ:** వైకాపా అధ్యక్షుడు జగన్‌కు రాజధానిపై స్పష్టత లేదని మంత్రి నారాయణ విమర్శించారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజధానిపై వైకాపా నేత సజ్జల రామకష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ''రాజధానికి 30వేల ఎకరాలు కావాలని అసెంబ్లీలో జగనే చెప్పారు. ఆ తర్వాత పొలిటికల్ గేమ్‌తో మూడు ముక్కలాట ఆడారు. ఏ పార్టీ అయినా.. ప్రజల అభిప్రాయం ప్రకారం రాజకీయం చేయాలి. అనంతపురం, శ్రీకాకుళానికి అమరావతి సెంటర్ పాయింట్‌లో ఉంది. అమరావతికి రైల్వే కనెక్టవిటీ, పోర్టు, ఎయిర్ పోర్టు దగ్గరలోనే ఉన్నాయి. రాజధానిగా అమరావతిని అంగీకరించి అసెంబ్లీలో జగన్ కూడా చేతులెత్తారు. మళ్లీ ప్రభుత్వం రాగానే మాట మార్చారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అని.. మళ్లీ అధికారం కోసం అమరావతి అని మాట మార్చడం కరెక్ట్ కాదు.

ఇలా చేస్తే భవిష్యత్‌లో ప్రజలు ఆ 11 సీట్లు కూడా ఇవ్వరు. గదిలో కూర్చొని నలుగురైదుగురు ఇచ్చే సలహాలు పాటించకూడదు. సజ్జల ఆ పార్టీలో సీనియర్‌నేత.. ఆయన చెబితే వైకాపా చెప్పినట్టే కదా. వారి పార్టీ అభిప్రాయమే ఆయన చెప్పారు. నేను మంత్రిగా మాట్లాడితే సీఎం చంద్రబాబు చెప్పినట్టే కదా. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అమరావతి, విజయవాడ, మంగళగిరి, తెనాలి, గుంటూరు కలిపి భవిష్యత్తులో మహా నగరంగా చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన'' అని మంత్రి నారాయణ వివరించారు.

విజయవాడలో డయేరియా మూలాలు కనుక్కునేందుకు దష్టి పెట్టాం విజయవాడలోని న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియా మూలాలు ఎక్కడున్నాయో కనుక్కొనేందుకు దష్టి పెట్టామని మంత్రి నారాయణ తెలిపారు. ఆర్ఆర్ పేటలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డయేరియా మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. నూతన ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఈ సాయంత్రం లేదా రేపు ఉదయానికి నీటి పరీక్షల నివేదికలు వస్తాయన్నారు. రిపోర్టులు వచ్చాక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయేరియాకు కారణం తాగునీరా లేదా ఫుడ్ పాయిజన్ అన్నది స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 15 వేల వాటర్ క్యాన్ల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 150 మంది చికిత్స తీసుకుని ఇంటికెళ్లారని వివరించారు. డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని సూచించారు.

## కృష్ణా నీటి వాటాలో ఒక్కచుక్కా వదులుకోం

(మొదటి పేజీ తరువాయి)

ట్రైబ్యునల్ కు అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా, ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టి 299 టీఎంసీల వాటాకు ఒప్పుకుని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఇప్పుడు ఏపీ ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. గడచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించడంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణాపై తలపెట్టిన పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందనీ, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత రెడ్డి అధికారులను ఆదేశించారు.

## కృష్ణా జలాల్లో 71 శాతం వాటా సాధిస్తం

### 23 నుంచి ట్రైబ్యునల్‌లో మన వాదన బలంగా వినిపిస్తం
### గత పాలకుల నిర్లక్ష్యంతోనే రాష్ట్రానికి అన్యాయం
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 13, (మనం బ్యూరో) :** కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన 71 శాతం వాటా సాధిస్తామని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇదే అంశంపై కృష్ణా ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈనెల 23 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ దృష్ట్యా నీటిపారుదల రంగ నిపుణులు, న్యాయ నిపుణులతో శనివారం మంత్రి ఉత్తమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71 శాతం వాటాను డిమాండ్ చేస్తున్నామన్నారు. న్యాయంగా రావాల్సిన వాటాను ఎట్టి పరిస్థితుల్లోనూ సాధిస్తామనీ, ఈ నీటితో తాగు, సాగునీరుతో పాటు పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబ్యునల్ విచారణ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వచ్చి సమీక్షిస్తారని వెల్లడించారు. రాష్ట్రాల పునర్విభజన చట్టం ప్రకారం...తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం మేర నీటి కేటాయింపులు ఉండాలనీ, అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రైబ్యునల్‌కు సమర్పించామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని పునరుద్ఘాటించారు. జూన్, జూలై మాసాల్లో 80 టీఎంసీల నీటిని అందుబాటులో ఉంచడంతో పాటు ఆపరేషన్ ప్రోటోకాల్ అనుసరించి నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణకు ఉండేలా ట్రైబ్యునల్ ముందు ఉంచుతామని పేర్కొన్నారు. ఏపీ అక్రమంగా వినియోగిస్తున్న 291 టీఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతోందనీ, రాష్ట్ర హక్కులను కూడా ట్రైబ్యునల్ ఎదుట జరిగే వాదనల్లో వినిపిస్తామని చెప్పారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల అంశాలతో కూడిన ప్రత్యేక జీవోను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని వెల్లడించారు. గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లనే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించుకోలేక పోయిందని విమర్శించారు. గత పాలకుల ఉదాసీనత కారణంగా ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోయి ప్రయోజనం పొందిందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

● ఆపరేషన్ మహాదేవ్

## వీర సైనికులకు కేంద్ర హోం శాఖ సత్కారం

**గాంధీనగర్, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** కేంద్ర హోం మంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా, ఇటీవల ఆపరేషన్ మహాదేవ్‌లో పాల్గొన్న పరాక్రమవంతులైన సిబ్బందిని సత్కరించారు. ఆయన కేవలం భారతదేశ భద్రతా వ్యూహాల రూపశిల్పి మాత్రమే కాకుండా, దేశ వీర సైనికుల యొక్క అగ్రగామి ప్రేరకుడు, రక్షకుడు కూడా అని నిరూపించారు. ఆపరేషన్ మహాదేవ్‌లో భారత సైన్యం, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ప్రదర్శించిన ఆదర్శప్రాయమైన ధైర్యం, అంకితభావాన్ని గుర్తించడం ద్వారా, అమిత్ షా వారి హీరోయిజాన్ని యావత్ దేశానికి జాతీయ గర్వకారణంగా సత్కరించారు. ఆయన భద్రతా దళాల మనోస్థైర్యాన్ని అవిశ్రాంతంగా పెంచే, వారి సేవను గౌరవించే మరియు జాతీయ భద్రత యొక్క దృఢమైన స్తంభాలుగా వారిని బలోపేతం చేయడానికి సాధ్యమైన ప్రతి మద్దతును అందించే హోం మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యొక్క దార్శనిక నాయకత్వం మరియు హోం మంత్రి యొక్క దృఢమైన వ్యూహాల కింద, భారతదేశం ఉగ్రవాదంపై ఒక నిర్ణయాత్మక యుద్ధం చేసింది, అదే సమయంలో భద్రత, అభివృద్ధి మరియు స్వావలంబనను ముందుకు తీసుకువెళుతోంది. షా యొక్క దృఢమైన విధానంతో మార్గనిర్దేశం చేయబడిన ఈ దేశం, సరిహద్దు ఉగ్రవాదం మరియు అంతర్గత భద్రతను సవాలు చేసే అంశాలపై రాజీలేని చర్యలు తీసుకుంది.

ఇటీవలి సంవత్సరాలలో, అమిత్ షా యొక్క దూరదృష్టి మరియు సంకల్పం భద్రతా దళాలలో



తాజా ఆత్మవిశ్వాసాన్ని నింపి, దేశ భద్రతా నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడాన్ని ఈ దేశ పౌరులు చూశారు. ఆయన విధానాలు ఉగ్రవాదులకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపాయి, భారతీయ పౌరుల భద్రతకు ముప్పు కలిగించడానికి సాహసించే వారు ప్రతీకారాన్ని ఎదుర్కొంటారు. షా నేతృత్వంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, భారత సైన్యం మరియు జమ్మూ మరియు కాశ్మీర్ పోలీసులు, పహల్గామ్ దాడికి బాధ్యులైన ఉగ్రవాదులను నిర్మూలించడం ద్వారా అచంచలమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇది కేవలం భద్రతా దళాలకు మాత్రమే కాదు, యావత్ దేశ ఆత్మగౌరవానికి ఒక విజయం. నేడు ఉగ్రవాదంపై భారతదేశపు గొప్ప ఆయుధం ప్రజల విశ్వాసం మరియు దాని భద్రతా సిబ్బంది యొక్క శక్తి.

## జీఎస్టీ సవరణలతో తగ్గనున్న భారం

**ఢిల్లీ, సెప్టెంబర్ 13:** 2025-26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని విమర్శించారు. దీని వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారింది అని అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి దీర్ఘకాల వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోడీ తెలిపారు.

## నేడు భూఅయస్కాంత తుపానులు

**ఢిల్లీ, సెప్టెంబర్ 13:** మండే సూర్యుడిపై సీతాకోకచిలుక ఏమిటంటూ ఆశ్చర్యపోతున్నారా? అయితే, ఒక్క క్షణం ఆగండి! ఆ కీటకం ఆకృతిలో సూర్యగోళం బాహ్య పొరల్లో 5 లక్షల కి.మీ. విస్తీర్ణంతో ఏర్పడిన భారీ రంధ్రం ఇది. నాసాకు చెందిన సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ ఈ నెల 11న ఈ అరుదైన దృశ్యాన్ని చిత్రీకరించింది. ఈ భారీ రంధ్రం నుంచి వెలువడుతున్న సౌర గాలులు ఈ నెల 14న భూమిని తాకే అవకాశం ఉందని, దీనివల్ల స్వల్ప స్థాయి నుం చి ఓ మోస్తరు భూఅయస్కాంత తుపానులు ఏర్పడ వచ్చని నాసా తెలిపింది. ఈ క్రమంలో అంతరిక్ష వాతావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. ఉపగ్రహాల కార్యకలాపాలకు, సాంకేతిక వ్యవస్థలకు అంతరాయం కలగవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. భూమి, సూర్యుడికి మధ్య ఏర్పడే అయస్కాంత క్షేత్రాల అనుసంధానతపై అధ్యయనాలు జరిపేందుకు ఇదో అవకాశంగా భావిస్తున్నారు.

# వైయస్ జగన్ నిర్మించిన వైద్య కళాశాలలను చూపించడానికి సిద్ధం

- దమ్మంటే నాతో పాటు పరిశీలనకు వస్తారా?
- కూటమి మంత్రులకు మాజీ మంత్రి ఆర్కె రోజా సవాల్



**తిరుపతి, సెప్టెంబర్ 13 మనం న్యూస్ :** వైయస్ జగన్ గారు ఈ రాష్ట్రంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చూపించడానికి సిద్ధంగా ఉన్నానని, కూటమి ప్రభుత్వంలోని మంత్రులకు దమ్ముంటే తనతో వాటిని పరిశీలించేందుకు రావాలని మంత్రి ఆర్కె రోజా సవాల్ విసిరారు. నగరిలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... పేద విద్యార్థులకు మెడికల్ విద్యను, పేదలకు మెరుగైన వైద్యంను అందించాలనే గొప్ప సంకల్పంతో సీఎంగా వైయస్ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకువస్తే, నేడు చంద్రబాబు వాటిని తనకు కావాల్సిన వారికి తెగనమ్మేందుకు సిద్ధపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వైయస్ జగన్ ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక కూటమి మంత్రులతో ఆయనపై దూషణలకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల నమ్మకాన్ని అమ్ముకుంటున్న దౌర్భాగ్యపు ప్రభుత్వమిదని అన్నారు. ఇంకా ఆమె ఏమన్నారంటే...

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోంది. నాలుగుసార్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏనాడైనా తన హాయంలో ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీలను నిర్మించాలనే ఆలోచన చేశారా? తొలిసారి సీఎం అయిన వైయస్ జగన్ గారు పేదల వైద్య విద్య కలను సాకారం చేయడంతో పాటు, పేదలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏకంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైయస్ జగన్ గారి హయాంలో ఏడు కాలేజీల నిర్మాణం పూర్తయ్యింది. వాటిల్లో గత ఏడాదితో కలిపి ఆరు కాలేజీల్లో ఇప్పటికే మెడికల్ విద్య ప్రారంభమయ్యింది. పులివెందుల మెడికల్ కాలేజీ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా కూడా దానిని అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిందో ప్రజలందరికీ తెలుసు. అసంపూర్తిగా ఉన్న మిగిలిన పది మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెలకు కనీసం రూ.100 కోట్ల చొప్పున కూడా కేటాయించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వ రంగంలో ప్రారంభించాల్సిన మెడికల్ కాలేజీలను తనకు కావాల్సిన వారికి దారాదత్తం చేసేందుకు సీఎం చంద్రబాబు తెగబడ్డారు. భవిష్యత్తులో రూ.లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో సహా పప్పూబెల్లాల్లా చంద్రబాబు తన బినామీలకు కట్టబెడుతుంటే, ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్ గారు దానిని ప్రశ్నించారు. ఆయన ప్రశ్నలకు సమాధాన చెప్పాల్సిన సీఎం చంద్రబాబు బదులివ్వకుండా, తన మంత్రులను రెచ్చగొట్టి, వైయస్ జగన్ గారిపై దూషణలకు ప్రోత్సహిస్తున్నారు.

**'బాబు' హయాంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ అయినా నిర్మించారా?**

తాజాగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై హోంమంత్రి అనిత ఇచ్చిన ప్రజంటేషన్ చూస్తే, ఆమెకు ఉన్న ఫ్రస్టేషన్ కనిపిస్తోంది. మీడియా సమావేశంలో ఆమె ప్రదర్శించిన ఫోటోలు, వీడియోలను పరిశీలిస్తే, అవ్వన్నీ కూటమి ప్రభుత్వం తయారు చేయించిన ఫేక్ వీడియోలు, ఫోటోలు అని అర్థమవుతోంది. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను ఆపేందుకు తీసుకున్న చర్యలపై ఏనాడు ఆమె ఒక్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలను ఎలా కాపాడుతుందో ఇలాంటి ప్రజెంటేషన్ ఏనాడు చేయలేదు. కేవలం చంద్రబాబు ప్రయోజనాలను కాపాడటానికే ఆమె ముందుకు వచ్చింది ఈ రోజు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే విషయాన్ని సమర్థించుకునేందుకు తంటాలు పడుతున్నారు. సీఎం వైయస్ జగన్కు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించడం చేతకాలేదు, అదే చంద్రబాబు హయాంలో ఈ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారు, ఎన్నింటిని నిర్మించారో హోంమంత్రి అనిత తన ప్రజెంటేషన్ లో అద్భుతంగా వివరిస్తారని ప్రజలంతా ఎదురుచూశారు. కానీ ఆమె చెప్పిన దానిలోనే నాలుగుసార్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీని కూడా నిర్మించలేదు, కనీసం అలా ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మించాలనే ఆలోచనే చేయలేదని స్పష్టంగా తేలిపోయింది. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు అని హోంమంత్రి అనిత చెబుతోంది. అంటే పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాకపోతే, రౌడీషీటర్లకు ఇచ్చే పెరోలా? అనిత సమాధానం చెప్పాలి. పీపీపీ కానప్పుడు, డబ్బులు లేక ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఇస్తున్నామని ఎందుకు జీఓ ఇచ్చారు? అనిత చెప్పేదే నిజమైతే ఆ జీఓను రద్దు చేయాలి.

పవన్ కళ్యాణ్ షూటింగ్లు చేసుకోవడానికి, ప్రభుత్వ ధనంతో స్పెషల్ ఫ్లైట్లు ఎక్కి ఎంజాయ్ చేయడానికి కాదు ప్రజలు అధికారాన్ని ఇచ్చింది. చంద్రబాబు పాలనలో తప్పులు జరుగుతుంటే, సరిచేయాలి. పిఠాపురంలో బాలికపై అఘాయిత్యం జరిగితే పట్టించుకోరు. రైతుల యూరియా బాధ పట్టదు. తన ప్యాకేజీ కరెక్ట్గా ఇస్తే చాలు. చంద్రబాబు సమకూర్చిన హెలికాప్టర్లో ఎక్కి తిరగడమే తప్ప రాష్ట్రం గురించి పవన్ ఎప్పుడైనా ఆలోచించారా? ఎప్పుడైనా మాట్లాడుతున్నారా? 17 మెడికల్ కాలేజీలను అమ్మకానికి పెడితే సిగ్గులేకుండా దానికి తలాడిస్తున్నాడని మాజీ మంత్రి ఆర్కె రోజా మండిపడ్డారు.

# తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో ఆకస్మిక తనిఖీలు



**తిరుమల, సెప్టెంబర్ 13,మనం న్యూస్ :** తిరుమలలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన ఆయన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. మారుతున్న టెక్నాలజీని అనుసరించి నూతన సాఫ్ట్వేర్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని సూచించారు. తిరుమలలో మిస్సింగ్ పర్సన్స్ గుర్తించే ప్రక్రియ మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తిరుమలలోని ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయగల విధంగా సిబ్బందిని నియమించి కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రియల్ టైమ్లో వ్యక్తుల గుర్తింపు, ఘటనలపై నిఘా కోసం ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను వినియోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవో ఎల్టీ సిబ్బందితో కూడా టెక్నాలజీ వినియోగంపై చర్చించారు. అనంతరం ఈవో లగేజీ కౌంటర్ను పరిశీలించి భక్తులతో మాట్లాడారు. దర్శన టోకెన్ పొందిన సమయం, దర్శనం పూర్తైన సమయాలను వాకబు చేశారు. ఈ సందర్భంగా భక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ శ్రీవారి దర్శనం టీటీడీ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -2 కు చేరుకుని భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవకులతో మాట్లాడారు. భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సందర్భంగా శ్రీవారి సేవకులకు మరింత నాణ్యమైన శిక్షణ ఇచ్చి తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఆర్వో డాక్టర్ టి.రవికి సూచించారు. ఈ తనిఖీల్లో ఈవో వెంట సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ డా. మధుసూదన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



**తిరుమల, సెప్టెంబర్ 13,మనం న్యూస్ :** టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవాదాయశాఖ సెక్రటరీ హరి జవహర్ లాల్, బోర్డు సభ్యులుగా సుదర్శన్ వేణు శనివారం శ్రీవారి ఆలయంలో ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అదనపు ఈవో అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ




**తిరుపతి, సెప్టెంబర్ 13 మనం న్యూస్ :** క్రీడల అభివృద్ధికి దాతలు ముందుకొచ్చి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ3, పీ4 విధానం ద్వారా క్రీడాసదుపాయాల కల్పనకు కృషి చేయాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పిలుపునిచ్చారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్లో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తిరుపతి వారు శాప్ ఛైర్మన్ చొరవతో పీ4 విధానం ద్వారా ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా రూ.15లక్షలతో నిర్మించనున్న ఇండోర్ బాక్సింగ్ హాల్ నిర్మాణానికి రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నర్సింహ యాదవ్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నర్సింహ యాదవ్ మాట్లాడుతూ పీ4 విధానం ద్వారా బాక్సింగ్ హాల్ నిర్మాణానికి జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ వారు ముందుకురావడం హర్షణీయమని, వారిని ఆదర్శంగా తీసుకుని మరింతమంది దాతలు ముందుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు దాతలు ముందుకొచ్చి బాక్సింగ్ రింక్ ఏర్పాటుకు తోడ్పాటును అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జేసీఐ సభ్యులను వారిరువురూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) కమిషన్ ఛైర్మన్ డా.ఎన్.బి.హర్షవర్ధన్ రెడ్డి, జేసీఐ జోన్ ప్రెసిడెంట్ టి.భరత్ కుమార్, జేసీఐ తిరుపతి ప్రెసిడెంట్ శేషసాయి, జేసీఐ అడ్మినిస్ట్రేటివ్ కమిటీ మెంబర్ జిఎల్.మనోహర్, జేసీఐ తిరుపతి ఫౌండేషన్ ఛైర్మన్ ఎమ్.భాస్కర్ నాయుడు, జేసీఐ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్ కుమార్, రత్నశేఖర్, వి.దిలీప్ కుమార్, శంకర్, సోమయ్య, డీఎస్డీఓ శశిధర్ పాల్గొన్నారు.

# నేటి నుంచి మహిళా సాధికారితపై పార్లమెంటరీ, శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సు

- సీఎం చంద్రబాబు రాక
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి, సెప్టెంబర్, 13మనం న్యూస్ :** ఈ నెల 14,15 తేదీలలో జిల్లాలో జరగనున్నతొలి మహిళా సాధికారితపై పార్లమెంటరీ, శాసనసభ కమిటీల జాతీయ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. నేడు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గారి ఆధ్వర్యంలో సంబంధిత శాఖాధికారులు, పోలీసు విభాగం, ట్రాఫిక్ సిబ్బంది, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పరిశీలించారు. మొదటి రోజు తిరుపతి రాహుల్ కన్వెన్షన్ సెంటర్ నందు ఉదయం 10.50 గంటలకు గౌరవ లోక్ సభ స్పీకర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్,అసెంబ్లీ స్పీకర్, జిల్లా ఇంచార్జ్ మంత్రి,రాష్ట్ర శాసన వ్యవహారాల శాఖ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, పార్లమెంట్ మరియు అసెంబ్లీల మహిళా సాధికారిత కమిటీ చైర్పర్సన్ లు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అనంతరం పాల్గొన్న ప్రముఖులు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 12.30 గంటలకు కమిటీ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన విందులో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. విందు అనంతరం ముఖ్యమంత్రి 2.15కు తిరుగు ప్రయాణముకానున్నారని తెలిపారు.

మద్యాహ్నం 1.30 గంటలనుండి 4.30 గంటలవరకు సదస్సులో మహిళా సాధికారత ప్రధాన అంశాలపై చర్చిస్తారు. ఈ కార్యక్రమం అనంతరం రాత్రి 7.30 గంటలకు చంద్రగిరి కోట నందు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విచ్చేసిన కమిటీ ప్రముఖులకు అసెంబ్లీ స్పీకర్ అతిధ్యమిస్తారన్నారు. రెండవ రోజు 15న ఉదయం 10 గంటలకు గౌరవ రాష్ట్ర గవర్నర్, లోక్ సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, అసెంబ్లీ స్పీకర్, లెజిస్లేటివ్ కౌన్సిల్ డిప్యూటీ చైర్పర్సన్, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, పార్లమెంట్ మరియు అసెంబ్లీల మహిళా సాధికారిత కమిటీ చైర్పర్సన్ లు పాల్గొని కార్యక్రమంలో ప్రసంగిస్తారు. కార్యక్రమం ముగింపు అనంతరం మద్యాహ్నం కమిటీ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర గవర్నర్ అతిధ్యమిస్తారు. 2.45గంటలకు శ్రీ కాళహస్తి దర్శనం అనంతరం రాత్రి 7.30 గంటలకు రాహుల్ కన్వెన్షన్ హాల్ నందు అతిధులకు డిప్యూటీ స్పీకర్ ఆతిధ్యం ఇస్తారు.

ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి మహిళా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారని, వివిధ రాష్ట్రల నుండి కమిటీ సభ్యులు, మహిళా ప్రతినిధులు పాల్గొని మహిళా సాధికారిత అంశాలపై చర్చించనున్నారని, రాష్ట్ర మరియు కేంద్ర స్థాయి ముఖ్య అతిథులు కూడా హాజరుకానున్నారని, సదస్సు విజయవంతం కావడానికి అవసరమైన వసతి, భోజన, రవాణా, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయబడ్డాయని తెలిపారు. వైద్య బృందాలు, అంబులెన్స్ లు, అత్యవసర సౌకర్యాలు, ఇతర సదుపాయాలు సిద్ధం చేసామని తెలిపారు. సదస్సుకు విచ్చేసిన ప్రముఖులు, ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళిక రూపొందించామని, అలాగే సదస్సు ప్రాంగణంలో స్వచ్ఛత, నీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ జాతీయ సదస్సు ద్వారా మహిళా సాధికారితకు దారితీసే కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని, అన్ని శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# అమ్మవారి సేవలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

**తిరుచానూరు, సెప్టెంబర్ 13 మనం న్యూస్ :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, టిటిడి జెఈవో వీరబ్రహ్మం, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏవిఎస్వో రాధాకృష్ణమూర్తి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎమ్మార్వో రామానుజులు, ఏవిఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈవో దేవరాజులు, సూపరిండెంట్ ప్రసాద్, తిరుచానూరు ఎస్ఐ అరుణ, ఇన్స్పెక్టర్లు సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు, ఏఎస్ఐ శ్రీనివాసులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో చెట్లు కీలక పాత్ర

**తుర్కయంజాల్, సెప్టెంబర్ 13( మనం న్యూస్):** మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి ఆదేశానుసారము తుర్కయంజాల్ పరిధిలోని రాగన్న గూడ ఎన్ఎస్ఆర్ నగర్ రోడ్ నెంబర్ 10 లో శనివారం స్మశానవాటికలో ఇద్దరు వ్యక్తులు కానుగు చెట్లను నరకడం జరిగింది. అంతిమ దహన సంస్కార అనంతరం




ఎండలకు చెట్ల నీడలో సేద తీర్చుటకు గాను మూడు పెద్ద కానుగు చెట్లను ఎన్ఎస్ఆర్ కాలనీకి చెందిన ఎస్ లక్ష్మయ్య, ఎస్ మల్లయ్య అను వ్యక్తులు, మున్సిపాలిటీ నుండి కానీ, కాలనీ పెద్దల నుండి కాని, ఎలాంటి అనుమతులు లేకుండా స్మశానవాటికలో చెట్లను నరకడం జరిగింది. బండి రాజశేఖర్ అనే వ్యక్తి వాహనంలో కట్టె లోడును తరలించినందుకు, 15 వేల రూపాయల జరిమానా వేయడం జరిగిందని మున్సిపాలిటీ అధికారులు తెలియజేశారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయని, ఆక్సిజన్ విడుదల చేస్తూ, గాలి, నీరు, మట్టి కాలుష్యాన్ని అరికట్టుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ వనిత, ఈఈ సురేష్, జవాన్ మధు, శివ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా ఎస్పీగా సుబ్బారాయుడు నియామకం



**తిరుపతి,సెప్టెంబర్ 13, మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాధారణ ఎస్పీల బదిలీలలో భాగంగా తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్. సుబ్బరాయుడును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధన్ రాజును ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

గతంలో తిరుపతి జిల్లా ఎస్పీగా సుబ్బారాయుడు బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో తిరుపతి జిల్లాలో గంజాయిని నిర్మూలించడం, రౌడీఇజాన్ని అరికట్టడంలో ప్రత్యేక పాత్ర పోషించారు అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను కూడ తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

వైకుంఠ ఏకాదశి దర్శనం టికెట్ల జారీ సందర్భంగా ఏర్పడిన తొక్కిసలాటలో కొంత మంది భక్తులు మృతి చెందగా పలువురు గాయపడ్డారు ఆ సంఘటనకు బాధ్యులుగా కొంత మంది అధికారులను సస్పెండ్ చెయ్యగా కొంతమందిని బదిలీ చేశారు. ఎస్పీ సుబ్బారాయుడును ఎర్రచందనం అక్రమరవాణా నిరోధక ప్రత్యేక అధికారిగా బదిలీ చేశారు. ఆనాడు జరిగిన ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది ఆ ఘటనలో ఎస్పీ సుబ్బరాయుడు ప్రమేయం ఏమి లేదని దర్యాప్తు అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరలా తిరుపతి జిల్లా ఎస్పీగా సుబ్బారాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే సుబ్బారాయుడు అధికారికంగా తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

# 15న తిరుపతికి మారిషస్ ప్రధానమంత్రి



**రేణిగుంట, సెప్టెంబర్ 13 :** మారిషస్ ప్రధానమంత్రి నవీన్చంద్ర రాంగులాం ఈనెల 15 వ తేదీన తిరుపతి లోని రామాపురం లోని బ్రహ్మ రిషి ఆశ్రమాన్ని సందర్శించి అనంతరం తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోనున్న నేపథ్యంలో మారిషస్ ప్రధానమంత్రి పర్యటన ప్రదేశాలలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ అధికారులను ఆదేశించారు.

శనివారం ఉదయం ముందస్తు భద్రత లైజన్ లో భాగంగా రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, సంబంధిత అధికారులతో మారిషస్ ప్రధాని పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్షస్ ప్రధాని సెప్టెంబర్ 15 న ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన తిరుపతి లోని రామాపుర లో ఉన్నటువంటి బ్రహ్మ రిషి ఆశ్రమాన్ని సందర్శించి, అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారని అనంతరం తిరిగి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ వారు అంబులెన్స్, స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, సేఫ్ రూమ్ ఏర్పాటు అమర ఆసుపత్రి, నారాయణాద్రి ఆస్పత్రి హాస్పిటల్ వైద్య సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో విధులు నిర్వహించాలని తెలిపారు. అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ తదితరాల ఏర్పాటు పై విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, బ్రహ్మ రిషి ఆశ్రమం అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, ఎయిర్పోర్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నీ చేతిలోనే

అభివృద్ధికి అవరోధాలైన
ఉచితాల ఊబిలో
అరవిందాలను పెంచుతూ,
వాటికై మోహపడేలా
ప్రజలను ప్రేరేపించి,
ప్రభంజనాలు సృష్టిస్తూ
రాబోవు తరాల భవితవ్యాన్ని
పీకల్లోతు ముంచేస్తున్న
ఓ రాజకీయనాయకుల్లారా!
ప్రజాస్వామ్యఫలాలు అందరికీ
సమంగా దఖలుపడాలన్న
రాజ్యాంగస్ఫూర్తి,
'కష్టార్జితంలో కొంతభాగాన్ని పన్నులరూపంలో
చెల్లిస్తోన్న
మధ్యతరగతి ప్రజల విషయంలో
నీరుగారిపోతోన్న విషయం
తమరికి తెలియదా!'
వారి వేదన అరణ్యరోదనేనా?

ఉపాధి కల్పించి, ప్రజలు అభివృద్ధి
సాధించే దిశగా సంక్షేమచర్యలుండాలి గాని
అప్పులు చేసి,పన్నులు పెంచి
ఉచితాలరూపంలో
పంచే పథకాలు కాదని గుర్తెరగండి.

సంక్షేమ నెపంతో ప్రజలకు డబ్బులిచ్చి,
ఆపై ఋణం కొరకు
రిజర్వ్ బ్యాంకు సన్నిధిని మోకరిల్లే ,
కాసుల్లేవని ఛిద్రమైనరోడ్లు బాగుచేయక
ప్రజలనేమార్చి వంచించే
ఓ పాలకుల్లారా! మీ ఈ విధానం
సరికాదని గుర్తెరగండి.
ఉచితాల తెరచాటున
పన్నుబడితి చేతబట్టి బాదుతుంటే,
తాళలేక వెర్రిచూపులు చూసే
ఓ పౌరుడా! మేలుకో.
'ఉచితాల ఊబికి' సమాధి
నీ చేతిలోనేనని తెలుసుకో.

- వేమూరి శ్రీనివాస్
9912128967

# 'విమోచన దినం' అనేందుకు భయమెందుకు?



నల్గొండ జిల్లా గుండ్రాంపల్లిలో ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 200 మంది గ్రామస్తులను చంపి బావిలో పడేశారు. 100 మహిళల పుస్తెలు తెంపోకొని ఎత్తుకెళ్లారు. ఇలాంటి ఉదంతమే ఇప్పటి సిద్దిపేట జిల్లా చేర్యాల తాలూకాలోని బైరాన్ పల్లిలో తెల్లవారు జామున నాలుగున్నర గంటలకే నిజాం ముష్కర్ మూకలు అత్యంత క్రూరంగా జరిపిన హత్యాకాండలో వేలాది మంది హిందువుల్ని వరుసగా నిలబెట్టి త్రినాట్ త్రీ రైఫిల్స్ ఎంతో మంది అమాయకులను ఊచకోత కోశారు. కనపడ్డ స్త్రీనల్లా బలాత్కరించారు. ఇలా వేలాది అతి క్రూరమైన ఉజ్వల ఘట్టలు..నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా.. బండి వెనుక బండి కట్టి రజాకార్లను తరిమికొట్టి అన్నట్లు.. మరో క్విట్ ఇండియా తరహా ఉద్యమం జరిగింది. తెలంగాణ మాతభాష కోసం, భూమికోసం, భుక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు ధిక్కార స్వరమే విరోచిత రైతాంగ సాయుధ పోరాటం, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం జరిగింది. తెలంగాణ బిడ్డల త్యాగాలను గుర్తించి సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని జరపడానికి పాలకులు ఎందుకు భయపడుతున్నారు?

1947 ఆగస్టు 15న దేశానికి బ్రిటిష్ పాలకుల నుంచి స్వతంత్రం వచ్చి దేశం మొత్తం మువ్వన్నెల జెండాలు ఎగురవేస్తూ సంబరాలు చేసుకుంటే.. హైదరాబాద్ రాష్ట్రం మాత్రం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోయింది. అప్పటికే 224 యేండ్లు పాటు నిజాం పాలకులు ఇక్కడ పాలిస్తున్నారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత కనీసం ఇక్కడి ప్రజలను నిజాం, రజాకార్లు జాతీయ జెండాను ఎగర వేయకుండా కర్ఫ్యూ విధిస్తూ నిర్బంధాలను కొనసాగించారు. హైదరాబాదు సంస్థానం దేశంలోని 550 సంస్థనాలలో పెద్దది. ఇందులో 8 తెలుగు జిల్లాలు, 5 మరాఠీ జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలు ఉండేవి. కోటీ ఎనభై లక్షల జనాభాలో సగం మంది మాతృభాష తెలుగు, 25 శాతం మంది మరాఠీ, 12 శాతం మంది ఉర్దూ, 11 శాతం మంది కన్నడ, ఇతర భాషలు మాట్లాడేవారు. కాని ఉర్దూలో తప్ప పాఠశాలలు లేవు. ప్రైవేటుగా మాతృభాషలో పాఠశాలలు పెట్టుకోవడానికి వీల్లేదు. తెలంగాణ ప్రాంతంలో భూ కేంద్రీకరణ విపరీతంగా వుండేది. మొత్తం సాగులో వున్న భూమి దాదాపు 70% భూస్వాముల చేతుల్లో వుండేది. 7వ నిజాం ఆస్తి అనాడు 400 కోట్లు. అప్పుడు ప్రపంచంలో కెల్లా ధనవంతుడని పేరుండేది. రాష్ట్రంలో ప్రజలు మాత్రం దుర్భర జీవితం గడిపేవారు. అన్ని కులాలవారు, జమీందార్లు, ప్రభుత్వ అధికారుల దగ్గర వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. చాలా మంది హిందువులను ముస్లింలుగా మారాలని ఎంతో హింసించేవారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం హైదరాబాద్ సంస్థాన ప్రజల మీద ప్రభావం చూపింది. అప్పటికే మజ్లిస్‌పార్టీకి ఖాశిం రజ్వీ అధ్యక్షుడై, హైదరాబాదును స్వతంత్ర ముస్లిం రాజ్యం చేస్తానని ప్రకటించి రజాకార్ల నిర్మాణానికి పూనుకుని వేలాదిమంది ముస్లింలను చేర్పించి దాడులు ప్రారంభించాడు. దీనికి నిజాం మద్దతి చ్చాడు. తెలంగాణను ముస్లిం మెజారిటీ సంస్థానంగా చేసేందుకు ఇతర రాష్ట్రాల నుండి 8 లక్షల మంది ముస్లింలను అంతకు ముందు తీసుకువచ్చారు. కరుడుగట్టిన



మతోన్మాదిగా రజకార్ల ఆయుధాలను హిందువులపై ఎక్కిపెట్టి తుపాకీ లతో కాల్చడం, వరుస పెట్టి ఉరి తీయడం, మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆడిపించడం, హత్యలు, అత్యాచారాలు, సజీవ దహనాలు చేయించారు. ఈ విలీన ఉద్యమంలో సుమారు 2 లక్షల మంది వీర మరణాలు పొందారు. హైదరాబాద్ స్టేట్‌ను భారత యూనియన్‌లో విలీనం చేయాలని ఏకైక డిమాండ్‌తో గడ్డి కోసిన చేతులే కొడవళ్లు పట్టి.. అన్నం వండిన చేతులతో తుపాకీలు పట్టుకొని నిజాం రజాకార్లపై ఎంతో మంది తెలంగాణ బిడ్డలు గెరిల్లా పోరాటం చేశారు. దేశానికి స్వతంత్రం వచ్చిన 13 నెలల తర్వాత 1948లో అప్పుటీ కేంద్ర హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ ధైర్య నిర్ణయంతో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ పోలో వలన నిజాం నిరంకుశ పాలన అంతమై, 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిన దినం. ఆపరేషన్ పోలో చేపట్టిన భారత సైనిక చర్య దేశంలో దేశం నలుమూలన నుంచి హైదరాబాద్ స్టేట్‌కు చేరి.. నిజం రాజును కిందికి దిగి వచ్చేలా చేసింది. కేవలం ఐదు రోజుల్లో ఆపరేషన్ పోలో ముగింప చేసి 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్‌ను భారత్‌లో విలీనం చేశారు. స్వయంగా నిజాం రాజు వచ్చి తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

**చరిత్ర తెలువకుండా చేసే కుట్ర..**

ఇంతటి చరిత్ర ఉన్న విమోచన దినాన్ని.. భవిష్యత్ తరాలకు తెలువకుండా చేసే కుట్రలు జరుగుతున్నాయి.. వారి స్వార్థ రాజకీయాల కోసం ఇక్కడి బిడ్డల మరణాలను, వారి త్యాగాలను స్మరించుకోకుండా మరుగున పడేసేలా చూస్తున్నారు. అంతకుముందు హైదరాబాద్ సంస్థానంలో ఉన్న కర్ణాటక మూడు జిల్లాలు, మహారాష్ట్ర ఐదు జిల్లాల్లో అక్కడి ప్రభుత్వాలు ఇంతటి చరిత్ర కలిగిన రోజున ముక్తి దివాస్ పేరిట అధికారికంగా వేడుకలు నిర్వహిస్తున్నాయి. ఇక్కడి ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణ విమోచన వేడుకలు నిర్వహించేందుకు బీజేపీ 1998 నుంచి పోరాటం చేస్తుంది. రాష్ట్రంలో బిజెపి అధ్యక్షులుగా గతంలో పని చేసిన విద్యాసాగర్ రావు మొదలు దత్తాత్రేయ, లక్ష్మణ్, బండి సంజయ్ కుమార్, కిషన్ రెడ్డి, ఇప్పుడు రామచంద్ర రావు పోరాటం చేస్తున్నారు. మరుగున పడిన చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి ఎంతగానో కషి చేస్తున్నారు. అంతేకాకుండా మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ 2022 నుంచి కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా జరుపుతుంది. అంతేకాకుండా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకాన్ని అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలనే ఫైల్ మీద సంతకం చేస్తామని ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. అధికారికంగా వేడుకలను చేయడం మాట పక్కన పెడితే ఇప్పుడు కనీసం తెలంగాణ విమోచన దినోత్సవం అనేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ భయపడుతున్నాయి.

బీఆర్ఎస్ - జాతీయ సమైక్యత దినం అని, కాంగ్రెస్- ప్రజా పాలన దినోత్సవమని ఇలా అమరుల త్యాగాలకు అవమానం చేస్తోంది. ఓటు బ్యాంకు, సంతుష్టి కరణ రాజకీయాలు, ఓవైసీకి భయపడటం కోసమే కదా..? మరింకేమిటి రైతులు, కూలీలు, మహిళలు ఇలా సబ్బండ వర్గాలు ఏకమై..కత్తులు, కొడవళ్ళు, కారంపొడి, బరిసెల్లు, తుపాకులు, రోకలి బండలతో ప్రాణాలు తెగించిన పోరాట చరిత్రను తెలియ కుండా చేస్తారు? పోరాట విలీన, స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆ పేరుతో ధైర్యంగా ఎందుకు జరపలేక పోతున్నారో? అర్ధమనస్సుతో ఎందుకు జరుపుతున్నారో సమాధానం చెప్పాలి. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బిజెపి ప్రతియేటా నిర్వహిస్తుంది.. బిజెపి విమోచన కమిటీ ఆధ్వర్యంలో ఇందులో భాగంగానే ఈ సారి పరేడ్ గౌండ్స్ లో సెప్టెంబర్ 15వ తేదీన నిర్వహించే వేడుకలకు కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్, వేలాది తెలంగాణ బిడ్డలు రానున్నారు.ఏమైనా చరిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటం. మన దేశం కోసం, మన కోసం, మన స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన, పోరాడిన ఆ యోధులను స్మరించుకోవడం మన బాధ్యత. ఆ గొప్ప పోరాటాల వీర గాధను మార్చి తెలంగాణ చరిత్రనే కను మరుగు చేస్తున్నరు. ఇది ముమ్మాటికి నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానించడమే.. వాళ్లకు చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరు కావాలి. తెలంగాణ విమోచన దినోత్సవం అంటే నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన రోజు.మరిచిపోలేని రోజు..

**సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం**

**- డా. చిన్నమైల్ అంజిరెడ్డి**
తెలంగాణ బీజేపీ విమోచన కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ
9848010980

# గాడిచర్ల బహుముఖ సేవలు



ఆంధ్రులలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుపొందిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావు (సెప్టెంబర్ 14, 1883 - ఫిబ్రవరి 29, 1960) స్వాతంత్ర్య సమర యోధుడిగా, పత్రికా రచయితగా, సంపాదకులుగా, సాహి తీకారుడిగా, గ్రంథాలయోద్యమ నాయ కుడి గా ఆయన తెలుగు జాతికి బహుముఖ సేవలు అందించారు. ఆంగ్ల పదం ఎడిటర్ కు సంపాదకుడు అనే తెలుగు పదాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి. ఎం.ఏ డిగ్రీ పొందిన ఆంధ్రులలో ఆయన రెండవ వారు.

1883 సెప్టెంబర్ 14న కర్నూలులో భాగీ రథీబాయి, వెంకటరావుదంపతులకు హరి సర్వోత్తమరావు జన్మించారు. వారి పూర్వీకు లు కడప జిల్లా, సింహాద్రిపురం గ్రామానికి చెందినవారు. వారిది పేద కుటుంబం. కర్నూ లు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక, ఉన్నత విద్య చదివారు. ఇంకా చదువుకునే ఆర్థిక స్తోమత లేకున్నప్పటికీ, ప్రతిభా పారితో షికాల సహాయంతో 1906లో మద్రాసు లో ఎం.ఏ డిగ్రీ పూర్తి చేసారు. తరువాత రాజ మండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతుం డగా,1907లో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రవేశించారు. రాజమండ్రిలో బిపిన్ చంద్ర పాల్ చేసిన ఉపన్యాస స్ఫూర్తితో విద్యార్థులంతా వందేమాతరం బ్యాడ్జిలు ధరించి తరగతికి వెళ్ళారు. వారికి నాయకుడైన సర్వోత్తమ రావును కళాశాల నుండి బహిష్కరించడమే కాక, ఆయనకు ఎక్కడా ఉద్యోగమివ్వ రాదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

తరువాత ఆయన పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. స్వరాజ్య అనే తెలుగు పత్రికను ప్రారం భించి, బ్రిటిషు పాలనపై విమర్శలు ప్రచురిం చేవారు. 1908లో తిరునెల్వేలిలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు మరణించినపుడు 'క్రూరమైన విదేశీ పులి' అనే పేరుతో ఆయన రాసిన సంపాద కీయంపై ప్రభుత్వం కోపించి, ఆయనకు మూడేళ్ళ ఖైదు విధించింది.

ఆ విధంగా ఆయన ఆంధ్రులలో ప్రప్రథమ రాజకీయ ఖైదీ అయ్యారు. వెల్లూరు జైలులో, బందిపోట్లు, గజదొంగలూ ఉండే గదిలో ఆయనను బంధించి, అమాను షంగా వ్యవహరించింది, బ్రిటిషు ప్రభుత్వం. జైలు నుండి విడుదల అయ్యాక కూడా ఆయనపై ప్రభుత్వ నిఘా ఉండేది. ప్రజలు ఆయనతో మాట్లాడటానికి కూడా భయపడేవారు.

1914లో బాల గంగాధర తిలక్ యొక్క హోం రూల్ లీగ్‌కు ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా విస్తృతంగా ప్రచారం చేసారు. 1924లో కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభల సమయంలో హిందూస్థానీ సేవా దళ్ ఏర్పాటులో ఆయన ప్రముఖ పాత్ర వహిం చారు.

1927లో కాంగ్రెసు అభ్యర్థిగా నంద్యాల నియోజక వర్గం నుండి మద్రాసు కౌన్సిల్‌కు ఎన్నిక య్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా కూడా పనిచేసారు.

1930 నుండి రాజకీయ కార్యక్రమాలు తగ్గించుకుంటూ, తనకెంతో ప్రీతిపాత్రమైన గ్రంథాలయోద్యమం వైపు దృష్టి మరల్చారు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థకు 1934 నుండి జీవితాంతం అధ్యక్షులుగా ఉన్నారు. గ్రంథాలయ కార్యకర్తలకు, వయోజన విద్యా ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించారు, శిక్షణా శిబిరాలు నిర్వహించారు.

ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిం చారు. 1952లో జరిగిన అఖిలపక్ష సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. దాని తరపున రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేసారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రమే కాక, సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కూడా చూసి, 1960 ఫిబ్రవరి 29న గాడిచర్ల హరి సర్వో త్తమ రావు మరణించారు. ఆయన స్మారకార్థం విజయవాడలో సర్వోత్తమ భవనం వెలసింది.

పత్రికా రచయితగా, సంపాదకులుగా, పుస్తక రచయితగా ఆయన చేసిన కృషి బృహత్తర మైనది. తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, మరాఠీ మొదలైన భాషలు కూడా ఆయనకు వచ్చేవి. ఎం.ఏ చదివే రోజుల్లోనే మొదలైన ఆయన సాహితీ వ్యాసంగం, జీవితాంతం కొనసాగింది. ఎన్నో కొత్త పదాలు సృష్టించారు.

ప్రముఖ దినపత్రిక ఆంధ్ర పత్రికకు ఆయన తొలి సంపాదకులుగా, 1916 నుండి 1918 వరకు సంపాదకుడుగా ఉన్నారు.

ది నేషనలిస్ట్, మాతృసేవ, ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, కౌముది, ఆంధ్రవార్త అనే పత్రికలకు కూడా సంపాదకత్వం నిర్వహిం చారు. మహిళల సమస్యలు పరిష్కరం కోసం 'సౌందర్యవల్లి' అనే పత్రిక నడిపారు. మద్రాసు గ్రామ పంచాయితీ అనే పత్రిక యొక్క తెలుగు, తమిళ, ఇంగ్లీషు ప్రతులకు సంపాదకుడిగా ఉన్నారు. సంపాదకుడు, భావకవిత్వం అనే పదాలను పరిచయం చేసింది కూడా ఆయనే.


జి.హెచ్.ఎస్ పేరుతో హిందూ పత్రికకు వ్యాసాలు రాసారు. స్పిరిట్యువల్ స్వదేశీ నేషనలిజం అనే పుస్తకం రాసారు. ఆయన రాసిన శ్రీరామ చరిత్ర అనే పుస్త కాన్ని 11వ తరగతికి ఉపవాచకంగా ప్రభుత్వం తీసుకున్నది. ఆయన రచించిన పౌరవిద్య అనే పుస్తకాన్ని మద్రాసు ప్రభుత్వం 1నుండి 6 తరగ తుల వరకు పాఠ్య పుస్తకంగా నిర్ణయించింది. వయోజన విద్య అనే తెలుగు పుస్తకాన్ని రచిం చారు. ఆయన వ్రాసిన అబ్రహాము లింకను చరిత్ర (1907)అనే పుస్తకాన్ని కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు సంకలించి విజ్ఞాన చంద్రికా గ్రంథ మాలలో భాగంగా ప్రచురించారు.

రాయలసీమకు ఆ పేరు పెట్టింది ఆయనే. 1928లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగిన ఆంధ్ర మహాసభలో రాయలసీమ పేరును గాడి చర్ల, చిలుకూరు నారాయణ రావు చేసిన సూచనతో ఏకీభవించి ఆ పేరు పెట్టారు. అప్పటి వరకు దత్తమండలం (సీడెడ్) అని పిలిచేవారు.

**సెప్టెంబర్ 14...గాడిచర్ల జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# రాజకీయ సాహిత్య సవ్యసాచి బూర్గుల



అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయన న్యాయవాది, బహుభాషా వేత్త, స్వాతం త్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు. హైదరా బాద్ రాష్ట్రకాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసిన తొలి తరం కాంగ్రెస్ నాయకులు. ఆయనే హైదరా బాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్ట మొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. తొలి ముఖ్యమంత్రిగా బాధ్య తలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామకృష్ణా రావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పని చేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు.

రామకృష్ణరావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగ రావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్)లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణెలోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు. బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు. 1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు.

బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్బీ పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూని యర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆంధ్రోద్యమం,గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా,కార్యదర్శిగాపనిచేసారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకు ల్లో బూర్గుల ప్రముఖులు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను పాల్గొని కారాగారవాసం అను భవించారు.1948లో పోలీసుచర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి,వెల్లోడి ముఖ్యమంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబా భావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు.

1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియో జక వర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజాప్రభుత్వంలో ముఖ్య మంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్న నూ, పరిపాలనదక్షుడైన ముఖ్యమంత్రిగా పేరు గాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమలతో కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్క ృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్రవిజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయవిద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా,దక్షిణభారత హిందీప్రచారసభ, సంస్కృత పరిషత్‌ల ఉపా ధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్కృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు. ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరా చార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణశతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం-మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మద్.గీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వాఙ్మయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు.ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది.1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండె పోటుతో మరణించారు.

**సెప్టెంబర్ 14... బూర్గుల రామకృష్ణారావు వర్ధంతి**

**-ఆర్‌కేఎస్**

# రావణుడిని సంహరించింది లక్ష్మణుడు



శ్రీమద్ రామాయణం ఎవరు రాశారు అంటే ఎంత ఆధునిక కాలం లో జీవిస్తున్న యువతరమైనా వాల్మీకి మహర్షి రాశాడని చెబుతారు. ఇప్పటికీ అంత ప్రాచుర్యం ఉంది. ఆయన తర్వాత అనేకమంది ఇంచుమించు అలాంటి పాత్రల్ని,సన్నివేశాల్ని తీసుకుని ఎవరిదైన శైలిలో వారు రాశారు. కాంబోడియా, వియాత్నం, ఇండోనేషియా , థాయ్ లాండ్ వంటి దేశాల్లో కూడా రామాయణాన్ని పోలిన భక్తి పరమైన గ్రంథాలు వచ్చాయి. అవి చదువుతుంటే ఇతివృత్త నిర్మాణం, కథ నడిచే పద్ధతి అంతా రామాయణాన్నే తలపిస్తాయి. కాకపోతే పాత్రల పేర్లు కొంత వేరే రూపాన్ని సంతరించుకున్నట్లు కనిపిస్తాయి. వాల్మీకి మహర్షి 24 వేల సంస్క ృత శ్లోకాల్లో ఈ మహత్తరమైన గ్రంథాన్ని వెలయించారు. క్రీ.పూ.7 నుంచి క్రీ.శ.3 శతాబ్దాల మధ్య కాలం లో వాల్మీకి రామాయణం రాయబడిందని ఆధునిక చరిత్రకారులు చెప్పారు.

అయితే ఈ ఇతిహాసం ఇంకా ప్రాచీనమైనదని మరికొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికి ఇన్ని వేల ఏళ్ళు భారతీయుల జీవితాల్లో ఒక భాగమై , మన సమాజాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేసిన ఇంకా చేస్తున్న గ్రంథరాజం మరియొకటి ఉందా అంటే లేదనే చెప్పాలి. దానిలోని పాత్రల్ని , విలువల్ని మీరు నచ్చినా నచ్చకున్నా ఇన్ని వేల ఏళ్ళపాటు జీవించగలిగిఉన్నదంటేనే ఆ కథనం లోని సృజనాత్మకత లో దేనిలోనూ లేని ఏదో మార్మికశక్తి ఉన్నదని అర్థం. మన భారత దేశం లోనే అనేక మంది పండితులు వాల్మీకి రామాయణాన్ని తిరిగి తమదైన శైలి లో రాశారు. రమారమి 300 కి పైగా వివిధ రామాయణాలు సాధ్యమైనంతవరకు వాల్మీకి రామాయణానికి దగ్గరగా ఉండేలా రాశారు. మరికొందరు కొంతమేరా స్వతంత్ర్య భావనల్ని చొప్పించారు. అంతమాత్రం చేత వాల్మీకి రామాయణం యొక్క ప్రాభవం ఏ మాత్రం చెక్కు చెదరలేదు.

జైన మతం లో కూడా రామాయణం ఉంది. హిందూ మత వటవృక్షం లో ఒక శాఖ వంటిది జైన ధర్మం అని చెప్పవచ్చును. పాత్రల పేర్లు అన్నీ అలాగే ఉంటాయి. ఇతివృత్తం లో వారిదైన స్వేచ్ఛని ప్రదర్శించారు. వారి ప్రధాన సిద్ధాంతాలైన అహింస ని, తీర్థంకరుల బోధనల్ని దాంట్లో సమ్మిశ్రితం చేశారు. విమలసూరి అనే జైన పండితుడు ప్రాకృత భాష లో ఈ గ్రంథాన్ని క్రీ.శ. 3 లేదా 4 వ శతాబ్దం లో రాసినట్లు పరిశోధకులు చెబుతున్నారు.

ఈ రామాయణాన్ని పౌమచరియ లేదా పద్మచరిత్ర అనే పేరు తో వ్యవహరిస్తారు. రాముడికి , లక్ష్మణుడికి ఆ పేర్లతో పాటు బల్ దేవ్, వాసు దేవ్ అనే పేర్లు కూడా ఉంటాయి. రావణుడు విద్యాధర వంశానికి చెందిన రాజు. లంకా రాజ్యాన్ని పాలిస్తుంటాడు. రావణుడికి పది తలలు ఉండవు. కానీ ఆయన పుట్టిన తర్వాత శిశువు గా ఉన్న సమయం లో అతని శిరస్సు పది రకాలైన ఆభరణాల్లో ప్రతిఫలించినట్లు రాశారు. రావణుడు జైన ధర్మాన్ని పాటించే వాడైనప్పటికీ పూర్వ జన్మ కర్మల వలన సీతా దేవి ని అపహరిస్తాడు.

విచిత్రం ఏమిటంటే జైన రామాయణం లో రావణుడి పాత్ర ని చంపేది లక్ష్మణుడు. ఎందుకంటే రాముడు స్వతహగా జైన దీక్ష తీసుకున్న రాజు కనుక తన చేతి తో హింస చేయడు. ఆ విధంగా రావణుడు,లక్ష్మణుడు మూడవ నరకానికి వెళతారు. హనుమంతుడు కూడా విద్యాధర వంశానికి చెందిన వాడే. ఈయనకి కొన్ని అతీత శక్తులు ఉంటాయి. మామూలు మనిషి లాగే ఉంటాడు.

కోతి మూతి ఉన్నట్లు రాయలేదు.అయితే ఆయన రాజ్యం లో కోతులు ఉంటాయి. రావణుడు సీత ని తాకకుండా నే మాయోపాయం తో లంక కి తీసుకొస్తాడు. లక్ష్మణ రేఖ గీయడం, మారీచుని ఘట్టం వంటివి జైన రామాయణం లో లేవు. జైన ధర్మం ప్రకారం ఇష్టపడని స్త్రీ ని బలవంతం చేయకూడదు కనుక లంక లోనే ఒక వనం లో ఉంచే ఏర్పాటు చేస్తాడు.

లక్ష్మణుడు చనిపోయిన తరువాత ఆయన దేహాన్ని ఖననం చేయకుండా, రాముడు ఎనిమిదేళ్ళపాటు ఉంచి ప్రతిరోజు స్నానం చేయించడం చేయిస్తుంటాడు. 24 తీర్థంకరులలో ఒకరైన ముని సువ్రత్ స్వామి రామునికి జ్ఞానబోధ చేసి తపస్సు చేయమని చెప్పి, అలాగే లక్ష్మణుడి దేహానికి తుది సంస్కారాలు చేయమని చెబుతాడు. ఆ విధంగానే చేసి రాముడు తన శేష జీవితాన్ని తపస్సు చేస్తూనే గడిపి స్వర్గం లో ఉన్న సీతా దేవి ని కలుసుకుంటాడు. సీతమ్మ అగ్నిప్రవేశం దీనిలో వేరుగా ఉంటుంది.

నీరు వచ్చి అగ్నిని ఆర్పేస్తుంది. అలాగే రామసేతు ని నిర్మించడం , వానరసేన లంకలో ప్రవేశించడం వంటి ఘట్టాలు లేవు. రాముడిని గొప్ప నిష్ఠాగరిష్ఠుడైన జైన ధర్మాన్ని గౌరవించే రాజు గా దీనిలో చిత్రించారు. జైనులు 24 తీర్థంకరులను , మళ్ళీ వారిలో మహావీరుడు,పార్శ్వనాథుడు, నేమినాథుడు, రిషభనాథుడు వీళ్ళందరిని ఎంత పూజ నీయులుగా చూస్తారో అలాగే రాముడిని కూడా భావిస్తారు.

**- మూర్తి కెవివిఎస్**
(7893541003)

# వెల్లంపల్లి , దేవినేని అవినాష్‌లు చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

- రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య.



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 13 (మనం న్యూస్):** విజయవాడ ఎంపి కేశినేని శివనాద్ (చిన్ని) ఒక సాహసవంతమైన నిర్ణయాన్ని తీసుకున్నారని, దసరా శరన్నవరాత్రులకు దేశంలోని నలుమూలల నుండి కొన్ని లక్షమంది భక్తులు వస్తున్న సందర్భంగా వారికి ఎగ్జిభిషన్, ఆటల పోటీలు తదితర కార్యక్రమాల కోసం ఆయన కృషి చేస్తున్నారని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్ లు చౌకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. విజయవాడ నగర వైభవాన్ని దేశానికి, ప్రపంచానికి చాటి చెప్పాలనే ఎంతో మంచి సంకల్పంతో పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రయాసపడుతుంటే వైసిపి నాయకులు చూడలేక, ఈర్ష్యతో అర్థరహితమైన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దసరా సందర్భంగా కొన్ని లక్షల మంది భక్తులు విజయవాడ వస్తున్న సందర్భంలో భక్తులకు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని భక్తులకు అందించాలనే మంచి ఉద్దేశంతో ఎంపి కేశినేని చిన్ని తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. దేవాదాయ శాఖకు డబ్బులు చెల్లించి స్థలాన్ని అద్దెకు తీసుకున్న విషయాన్ని విజయవాడ వైసిపి నాయకులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్ లు రాజకీయం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి తరువాత రెండవ అతి పెద్ద దేవాలయం విజయవాడ ఇంద్రకీలాద్రిపైన కొలువై ఉన్న కనకదుర్గమ్మ దేవాలయం అని అన్నారు. అటువంటి విశిష్టత కలిగిన దేవాలయాన్ని అధునాతనంగా అభివృద్ధి చేయాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పాటు పడుతున్నారని కొనియాడారు. కేంద్ర నిధులను తీసుకొచ్చి, రాష్ట్ర నిధులను వెచ్చించి విజయవాడ నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దడానికి ఎంపి కేశినేని చిన్ని పాటు పడుతున్నారని అన్నారు. అటువంటి నాయకుడి ప్రయాసను, విజయవాడ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకోలేని వెల్లంపల్లి శ్రీనివాసరావుకు రానున్న కాలంలో విజయవాడ ప్రజలు విజయవాడ నుండి తరిమికొడతారని అన్నారు. దేవాదాయ భూముల గురించి మాట్లాడే అర్హత వెల్లంపల్లికి లేదని ఆయన అన్నారు. నువ్వు దేవాదాయ మంత్రిగా ఉన్న సమయంలో అనేక దేవాలను వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేసిన సమయంలో వెల్లంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్ లు ఏంచేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాల నుండి, దేవాలయాలకు చెందిన ఎన్నో భూములను వైసిపి నాయకులు దోచుకున్నారని ఆయన అన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ లోకేసులు పరిష్కారం




- జడ్జి ఎం శైలజ

**మైలవరం సెప్టెంబర్ 13 మనం న్యూస్:** జాతీయ లోక్ అదాలత్ పిలుపుమేరకు స్థానిక కోర్టు పరిధిలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం శైలజ ముఖ్యఅతిథిగా పాల్గొని జరిగిన లోక్ అదాలత్ లో కేసులు పరిష్కారం అయ్యాయి. రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంకు కేసులు పరిష్కారం చేసుకొని సమయము, డబ్బు ఆదా చేసుకోవచ్చు అని కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. తొలుత బార్ అసోసియేషన్ న్యాయవాదులతో జరిగిన సమావేశంలో జడ్జి ప్రసంగించారు. జాతీయ లోక్ అదాలత్ లో 201 కేసులు పరిష్కారమైనవి వివిధ కేసుల్లో కక్షిదారుల మధ్య 43 లక్షల రూపాయలు, ఇచ్చిపుచ్చు కొనుచు రాజీ చేసుకున్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది పావులూరి వెంకట శేషగిరిరావు, ప్రభుత్వ న్యాయవాది ఏ జి పి ఏడీ ప్రసాద్, ఏపీపీ బి. కృష్ణ కిషోర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బుద్ధవరపు వెంకట్రావు, వీటి కిషోర్, ఓర్సు శ్రీనివాసరావు, ముల్లంగి రవికుమార్ న్యాయవాదులు ఎం. శరత్ బాబు, ఎం తనూజ్, మహిళా న్యాయవాదులు పసుపులేటి సుజిని, ఎం దివ్య తేజ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి




**మచిలీపట్నం, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** కృష్ణాజిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి గోపి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. చట్టానికి లోబడి రాజి కు ఆమోదయోగ్యమైన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజీమార్గమే రాచమార్గము అనే నినాదంతో ఇరుపార్టీలకు న్యాయం జరిగే విధంగా కేసులో సత్వర పరిష్కారం లభించడమే కాకుండా ఇరు పార్టీలు విజయం సాధించినట్లు అవుతుందని తెలిపారు. లోకదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయము డబ్బు ఆదాయి ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల కు పరిష్కారం లభించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జెండా 32 బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## రజకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్న రజక అధ్యక్షులు




**మైలవరం సెప్టెంబర్ 13 మనం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా, ఆముదాల వలస మండలం, కొత్తవలస గ్రామంలో అరసవల్లి హార్తమ్మ 70 సంవత్సరాల మహిళపై మరో ముగ్గురు ఆమె కుటుంబ సభ్యులపై వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వంలోని కొంతమంది పెత్తందారులు దాడి చేసి తీవ్రంగా గాయపరచి వృద్ధురాలు మరణించగా మిగిలిన వారికి తీవ్రమైన గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చట్టాలు పెట్టి ముద్దాయిలు వెంటనే అరెస్టు చేయాలని రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు బుద్ధవరపు వెంకటరావు, జిల్లా నాయకులు తాళ్లూరి శేషగిరిరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదేవిధంగా కృష్ణా జిల్లా నాగాయలంక గ్రామ బిల్ కలెక్టర్ కేతేపల్లి రామకృష్ణపై అధికార పార్టీ నాయకులు మండవ బాలవర్ధన్ రావు అతని అనుచరులు విధి నిర్వహణలో ఉన్న రామకృష్ణ పై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. రెండు సంఘటనలతో రాష్ట్రంలో రజకులకు రక్షణ లేకుండా పోయిందని అట్టడుగు వర్గంలో ఉన్న రజకులకు భద్రత కల్పించే విధంగా రజక సామాజిక రక్షించటం ఏర్పాటు చేయాలని తెలిపారు. వెంకట్రావు కార్యాలయంలో స్థానిక రజక సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన పత్రికా ప్రకటన ద్వారా ముద్దాయిలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాధాకృష్ణ కొండపల్లి రామకృష్ణ నాగవరపు మల్లయ్య, కొండపల్లి వెంకటస్వామి బుద్ధవరపు గోపాలం, కోరుకొండ లచ్చారావు, బుద్ధవరపు చలమయ్య, జమలయ్య, బొడ్డపాటి వేణు, డి వీరభద్రరావు, జి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నసమర్పణ సమితి ట్రస్ట్ ఎంతోమంది పేదలకు ఆకలి తీరుస్తుంది



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 13( మనం న్యూస్):** కోవిడ్ రెండవ దశలో 2021లో బాధితుల సహాయార్థం మొదలుపెట్టిన అన్న సంతర్పణ సమితి ట్రస్ట్, గత నాలుగు సంవత్సరాలుగా ఎంతోమంది ఆకలి తీరుస్తూ, ఎన్నో రకాలుగా ప్రజలకు సహాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతానికి విజయవాడలో గోపు వారి సత్రం, తమ్మన వారి సత్రం, పాత గవర్నమెంట్ హాస్పిటల్ మరియు ఏలూరు రోడ్డు కొత్తవంతన ఆంజనేయస్వామి గుడి వద్ద ప్రతిరోజు వందల మందికి నిత్యఅన్నదాన జరుగుతోంది. కేవలం అన్నదానమే కాక గవర్నమెంట్ స్కూల్లో చదివే పిల్లలకు నోటు పుస్తకాలు, సైకిళ్లు వృద్ధులకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, పిల్లల్లో నైపుణ్యత వెలికి తీయుట, మెరుగ్గా చదివే గవర్నమెంట్ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు ఆర్థిక సహాయం ఈ విధంగా అనేక కార్యక్రమాలు ఈ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నాము. సంస్థలు దాదాపు 250 మంది సభ్యులు, వాలంటీర్లు మరియు దాతల సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నాము. దాతల సహాయంతో నున్న డిమార్ట్ ఎదురుగా 300 గజాలు భూమిని సేకరించి అందు మూడంతస్తుల భవనాన్ని ప్రారంభించాము. అక్కడ వృత్తి విద్యలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యత అభివృద్ధి, ఉచిత వైద్య శిబిరాలు ఇలా అనేక కార్యక్రమాలు ఈ భవనం నందు సంవత్సరం పొడుగుతా నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు శ్రీ గుండు దిలీప్ అన్నారు. ఈ సంస్థ తరతరాలుగా ఎంతోమందికి ఉపయోగపడేలా ఏర్పాటు చేస్తామని సంస్థ కార్యదర్శి శ్రీ పి ఎస్ ఆర్ మూర్తి అన్నారు.

## ఆలయాల్లో జరిగే వివాహాలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

- ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలి.
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.




**విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్):** ఆలయాల్లో జరిగే వివాహాలపై ఆయా ఆలయాల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని.. ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వాసవ్య మహిళా మండలి, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు.. పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని వివిధ దేవాలయాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరమని.. బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలపాలని పేర్కొన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సి ఉందన్నారు. ఈ వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరక్కుండా కలిసికట్టుగా కృషిచేయాల్సి ఉందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందన్నారు. ప్రతి దేవాలయంలో వివాహానికి అర్హత వయసు, వయసు ధ్రువీకరణపత్రాలు, చట్ట నియమ నిబంధనలు తెలియజేసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల్లో జరిగే వివాహాలపై ఈవోలు ప్రత్యేకంగా దృష్టిసారించి, పర్యవేక్షించాలని సూచించారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేసేందుకు 112 నంబరుతో పాటు ఛైల్ హెల్ప్ లైన్ 1098కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయాల్లో ప్రదర్శించాల్సిన వివరాలతో కూడిన నమూనా పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి, ఎండోమెంట్ ఏసీ షణ్ముఖ నటరాజన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీగోవిందమాల ఆధ్వర్యంలో అన్నవితరణ



**గాంధీనగర్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్):** శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీ బాబు ఆధ్వర్యంలో శనివారం కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పూజ కార్యక్రమం అనంతరం పాత గవర్నమెంట్ హాస్పటల్ దగ్గర అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దాత పరిమికాయల నిర్వాన్ కృష్ణ సహకారంతో అన్నవితరణ చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్, దత్తి జ్యోతి, గద్దల ధనలక్ష్మి, పబతి కృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్ళజోళ్లను అందజేసిన ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

కార్యక్రమాల్లో పాల్గొన్న జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 13 మనం న్యూస్:**జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో గత నెలలో పట్టణంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాలలో కంటి లోపాలు ఉన్న వారికి కళ్ళజోళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ పాల్గొని కళ్ళజోళ్లను అందించారు. జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ మరియు ఎలమంచిలి రాఘవ ఆఫీసు ల వద్ద గత నెలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కంటి లోపములు గుర్తించిన 671 మందికి కళ్ళజోళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జయప్రద ఫౌండేషన్ చైర్మన్ శ్రీ దశరథ జనార్దన్ , శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య , మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నెట్టెం శివరాం లు పాల్గొన్నారు. జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరాలను నేతలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుల్లారావు , కన్నెబోయిన రామలక్ష్మి , నేతలు ఎలమంచిలి రాఘవేంద్ర రావు ,మైనేని రాధాకృష్ణ , రాంప్రసాద్ ,యామర్తి బోస్ యాదవ్ పాల్గొని వైద్య శిబిరాలలో కంటి లోపములు గుర్తించిన వారందరికీ కళ్ళజోళ్ళు అందించడమైనది. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ,ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కులాల మధ్య చిచ్చు పెడుతున్న పేర్ని నాని తీరు అత్యంత దుర్మార్గం

జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ




**మచిలీపట్నం సెప్టెంబర్ 13 (మనం న్యూస్):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను దూషించిన ఆర్.ఎం.పి వైద్యుడు గిరిధర్ వ్యాఖ్యలపై వెంటనే స్పందించి పోలీసులకు తెలిపామని చట్టపరమైన చర్యలు తీసుకొని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని పోలీసుల సమక్షంలో దాడి జరిగిందనేది వాస్తవం కాదని 2019 నుండి 24 వరకు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేసిన అరాచకాలు రాష్ట్ర ప్రజలకు తెలుసని ముఖ్యంగా మచిలీపట్నంలో పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యల కారణంగానే వైసిపి నాయకులు రెచ్చిపోతున్నారని అన్నారు జనసేన పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని కులాల కలుపుగోలు జనసేన పార్టీ సిద్ధాంతాలని జనసేన పార్టీకి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు సోదర సమానులని బండి రామకృష్ణ అన్నారు అర్ధరాత్రి 11వ డివిజన్ లో దళిత సోదరులు నిర్మించిన జనసేన పార్టీ జెండా దిమ్మను కూల్చి జనసేన పార్టీకి చెందిన దళిత నాయకులతో పాటు జనసేన పార్టీ నాయకులపై కేసులు కట్టించింది వాస్తవం కాదా తోట యశ్వంత్ అనే జనసైనికుడిని జడ్పీ కళ్యాణ మండపంలో బంతిలో కూర్చొని భోజనం చేస్తున్న యశ్వంత్ పై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరచండి వాస్తవం కాదా ఇలా చెప్పుకుంటూ పోతే పేర్ని నాని చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కావని అన్నారు ఘర్షణలను కులాలకు ఆపాదించడం తద్వారా లబ్ధి పొందాలనుకోవడం పేర్ని నానికి వెన్నతో పెట్టిన విద్య అని సోషల్ మీడియా ద్వారా ప్రజలందరికీ వాస్తవాలు తెలుస్తున్నాయని ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని తన ఉనికిని చాటుకోవడానికి పేర్నినాని ఎంతకైనా తెగిస్తారనిఅన్నారు.

## నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



- భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణబాబు.

**మచిలీపట్నం, సెప్టెంబర్13(మనం న్యూస్):** రాష్ట్ర రవాణా రహదారులు భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణబాబు గిలకలదిండిలో రూపుదిద్దుకుంటున్న ఫిషింగ్ హార్బర్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏపీ మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రణాళికకు సంబంధించిన మ్యాపులను పరిశీలించి డ్రెడ్జింగ్, బ్రేక్ వాటర్, భవన నిర్మాణాలు, టెట్రాపాడ్స్ దిమ్మల ఏర్పాటు తదితర పనుల పురోగతి వివరాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆశించిన రీతిలో పనులు ముందుకు సాగడం లేదని, దీనితో పురోగతి మందగించిందని పేర్కొంటూ, పనులను వేగవంతం చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ నెలాఖరికి పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించకపోతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## మోస్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహ కార్యక్రమం




**మైలవరం సెప్టెంబర్ 13 మనం న్యూస్:** స్థానిక మైలవరం ఓల్ స్టూడెంట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మైలవరం మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మరియు అనాధ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ కార్యక్రమం ఎస్ ఎస్ కె ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు జరిగినది. ముఖ్య అతిథిగా ఎంఈఓ ఎల్ బాలు, కాటమనేని వెంకటేశ్వరరావు, సభాధ్యక్షులు అడుసుమిల్లి విట్టల్ బాబు, మోస్ట్ సెక్రెటరీ జూలకంటి ప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి, మన్నే శ్రీను, మోస్ట్ ట్రెజరర్ అమీర్ హంజా, మదర్ థేరిసా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోయ సుధా మరియు ఎస్ ఎస్ కె స్కూల్ చైర్మన్ గొల్లపూడి మోహన్ రావు, భావన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 18 మంది విద్యార్థులకు రూ.72000 నగదు మరియు పదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు రూ.60000, మైలవరం ప్రభుత్వ కాలేజీ ఎంబీఎ+2 లో చదివి ఇంటర్మీడియట్ లో రాష్ట్ర రెండవ ర్యాంకు సాధించిన షేక్ షాజీదా ఖాతున్ కి రూ.5000 నగదు బహుమతి అందించడం జరిగినది. 10వ తరగతిలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన పసుపులేటి నందిని ని శాలువాతో మోస్ట్ సభ్యులు సత్కరించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి మాట్లాడుతూ 9,10, ఇంటర్మీడియట్ ఇంకా ఉన్నత విద్యాభ్యాసం కొరకు అనేక సంస్థలు తమ తమ ఫౌండేషన్స్ తరుపున విరివిగా స్కాలర్షిప్లు అందజేస్తున్నవని వాటికి దరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలని తెలియజేసారు. ఈ కార్యక్రమమునకు విద్యార్థులు తల్లిదండ్రులు మరియు మోస్ట్ సభ్యులుపాల్గొన్నారు.

## మృతి చెందిన వ్యక్తికి ఆర్థిక సహాయం చేసిన ఎరుపోతు రమణారావు



**విజయవాడ సెంట్రల్ సెప్టెంబర్ 13 (మనం న్యూస్):** ఎన్టీఆర్ నగర్(న్యూ రాజరాజేశ్వరీ పేట)నందు అనారోగ్యంతో మృతి చెందిన నరసింహ అనే వ్యక్తి దహనసంస్కారం ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయలను వారి కుటుంబానికి అందచేసి ,తన వంతుగా ఇంకా ఏ విధమైన సహాయం కావాలంటే తప్పక చేస్తా అని హామీ ఇచ్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసిన ఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఎరుబోతు రమణారావు.

# ఆవులు బెడద పంటలు బ్రతికెదెలా?



- 'వెట్టి ఆవుల నుండి రైతులను కాపాడండి..
- 'పత్తికొండ గ్రామ రైతులు ఆవేదన
- సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసిన రైతులు.

పత్తికొండ సెప్టెంబర్ 13(మనం న్యూస్): పత్తికొండ పట్టణంలో ఆవులు విచ్చలవిడిగా రోడ్లు పై తిరుగుతూ ట్రాఫిక్ కు ఇబ్బందులు పెడుతూ, మనుషుల ప్రాణాలు పోయేటటువంటి పరిస్థితి కూడా ఈ ఆవుల నుంచి పత్తికొండలో వాహనదారులు ఇబ్బందులతో ఉన్నారని, అదేవిధంగా గ్రామ శివారులో ఉన్నటువంటి పంట పొలాలు లోకి వెళ్లి పండిన పంటలు నాశనం చేసి వేల రూపాయల్లో నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పత్తికొండ పోలీస్ స్టేషన్ కి వెళ్లి సిఐ జయన్నకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సిఐ జయన్న మాట్లాడుతూ అయన మాట్లాడుతూ సోమవారం 10 గంటలకల్లా ఆవుల యజమానులు ఎవరైనా ఉంటే ఆవులను తమ ఇంటిదగ్గర కట్టేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సాయంత్రం వెట్టి ఆవులు గోశాలకు తరలిస్తామని ఆవుల యజమానులకు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి,సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర తో పాటు రామాంజి, రంగన్న, రామరాజు, భీమా, సీను,కాశి వీరేష్,కే రామంజి, నాగరాజు,30 మంది రైతులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాల నిరంతర పర్యవేక్షణ



- ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ పంపిణీ.
- ట్రాకింగ్, ట్రీట్మెంట్ విషయంలో పూర్తి అప్రమత్తం.
- డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.

విజయవాడ తూర్పు, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): న్యూ రాజరాజేశ్వరిపేటలో ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ అందిస్తున్నామని.. ప్రజలు కూడా అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలు పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ.. న్యూ జీజీహెచ్ను సందర్శించి డయేరియా బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. భయపడాల్సిన పనిలేదంటూ భరోసా కల్పించారు. అనంతరం ఆర్ఆర్పేటలో పర్యటించి ప్రజలకు స్వయంగా డయేరియాపై అవగాహన కల్పించారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని.. అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ డయేరియా కేసుల ట్రాకింగ్తో పాటు సకాలంలో వైద్యం అందించే విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరిలోనైనా రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి, వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్తగా ఫుడ్ అవుట్లెట్లను మూసివేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక కరపత్రాల ద్వారా అధికారు లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియాపై అవగాహన కల్పిస్తున్నారని.. ప్రజలు ఈ సూచనలను తు.చ. తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని.. అయితే జాగ్రత్తగా ఉండాలని.. ఏ సహాయం కావాలన్నా, సమాచారం కావాలన్నా కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (91549 70454) నంబరుకు కాల్ చేయొచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# విజయవాడ పార్లమెంట్‌ను నం.1గా తీర్చిదిద్దేందుకు కృషి

- ఎంపీ కేశినేని శివనాథ్ చేస్తున్నారు
- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా.




విజయవాడ తూర్పు, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): విజయవాడ పార్లమెంట్ ను దేశంలోనే ఒక ఉత్తమ పార్లమెంట్ గా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఎంపీ కేశినేని శివనాథ్ ముందు వెళుతున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. అందులో భాగంగానే విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్ పై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అవి వారి అవివేకానికి నిదర్శనమంటూ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా వైసిపి ఇన్చార్జ్ దేవినేని అవినాష్ , వెల్లంపల్లి శ్రీనివాస్ విజయవాడ ఉత్సవ్ ను అడ్డుపెట్టుకుని ఎంపీ కేశినేని శివనాథ్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను గురునానక్ కాలనీలో విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో నాగుల్ మీరా ఖండించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ గురించి దేవినేని అవినాష్ , వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడిన మాటాలు దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్నట్లు వున్నాయని ఎద్దేవా చేశారు. విజయవాడలో దసరా మహోత్సవాలు వందేళ్ల ఏళ్ల నుంచి ఎంతో ఘనంగా వైభవంగా జరుగుతున్నాయని, ఆ ఉత్సవాలను అద్భుతమైన రీతిలో ఇంకా బాగా జరిగేట్లు టిడిపి హయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కృషి జరిగిందన్నారు. దుర్గగుడి అభివృద్ధి టిడిపి హయంలోనే జరిగిందన్నారు. దుర్గ గుడి చుట్టు పక్కల వున్నటువంటి ప్రజలను ఖాళీ చేయించటానికి గజానికి రూ.50 నుంచి రూ.70 వేల రూపాయలు చెల్లించి... దుర్గ గుడి చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని టిడిపి పాలనలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తీసుకురావటం జరిగందన్నారు. దసరా ఉత్సవాలను ఘనం చేసే కార్యక్రమాన్ని జిల్లా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం, దేవదాయ శాఖ చూస్తోందన్నారు..దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించే ప్రణాళిక బద్ధంగా సకల ఏర్పాటు ఎన్డీయే కూటమి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఒక సాహసవంతమైన నిర్ణయానికి శ్రీకారం చుట్టారన్నారు. దసరా నవరాత్రులకి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్న సందర్భంలో విజయవాడ వైభవాన్ని దేశానికి ప్రపంచానికి చాటి చెప్పాలనే అద్భుతమైన సంకల్పంతోటి విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎంపీ కేశినేని శివనాథ్ శ్రీకారంచుట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ , ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జి.వి.నరసింహారావు, బిసి నాయకులు, మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.

# భారీ వర్షానికి కుళ్ళిపోయిన ఇల్లు



- బాధితునికి ఆర్థికం సాయం అందించాలి

దేవనకొండ, సెప్టెంబర్ 13,( మనం న్యూస్ ): మండల పరిధిలోని పి కోటకొండ గ్రామంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలిపోవడం జరిగింది. గిడ్డయ్య నాగమ్మ దంపతుల వివరాల మేరకు శుక్రవారం కురిసిన వర్షానికి ఇంట్లో ఉన్న పిండి వంటలకు సంబంధించిన సరుకులకు నష్టం వాటిలిందన్నారు. అధికారులు బాధితునికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# క్రికెటర్ ఎమ్మాస్సార్ మూర్తి సేవలు చిరస్మరణీయం

- ఎమ్మాస్సార్ మూర్తి మృతికి సంతాపం తెలిపిన ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపి కేశినేని శివనాథ్(చిన్ని), సానా సతీష్ బాబు



విజయవాడ తూర్పు, సెప్టెంబర్ 13 (మనం న్యూస్): తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన క్రికెటర్, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ మాజీ ఆంధ్రా రంజీ క్రికెట్ ప్లేయర్ ఎం.ఎస్.ఆర్. మూర్తి (73) మృతి పై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపి సానా సతీష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రంగంలో తీరని లోటని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ లో నివాసం వుంటున్న ఎం.ఎస్.ఆర్. మూర్తి వయోభారం కారణంగా శుక్రవారం (సెప్టెంబర్ 12వ తేదీ) మృతి చెందారు. ఎం.ఎస్.ఆర్. మూర్తి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని కోరుకుంటూ శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ఏసీఏ తరపున ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని),రాజ్యసభ ఎంపి సానా సతీష్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేయటంతోపాటు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఎం.ఎస్.ఆర్. మూర్తి తను చదువుకునే సమయంలో హైదరాబాదు స్కూల్స్, సౌత్ జోన్ స్కూల్స్, హైదరాబాద్ జూనియర్స్ తరఫున మెరుగైన ప్రదర్శన చేసి, ప్రతిభను నిరూపించారన్నారు.. అనంతరం కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో చేరి, జేఎన్టియు కళాశాలలకు కెప్టెన్గా కొనసాగుతూ, సౌత్ జోన్ యూనివర్సిటీ జట్టును కూడా ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. ఎం.ఎస్.ఆర్. మూర్తి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తరువాత ఈసీఐఎల్ సంస్థలో ఉద్యోగం చేస్తూ , హైదరాబాదు లీగ్ మ్యాచ్లలో పాల్గొన్నారని తెలిపారు. ఆ తర్వాత ఆయన స్వంత వ్యాపారాన్ని ప్రారంభించి, క్రికెట్ కు అంకితమై ఎనలేని సేవలు చేశారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆంధ్రా రంజీ మ్యాచ్ లో అగ్రశ్రేణి ఆటగాడిగా మంచి గుర్తింపు పొందిన ఎం.ఎస్.ఆర్. మూర్తి నేటితరం క్రీడాకారులకు ఆదర్శమన్నారు.

# ఒంటరి కులాల వారిపై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి

- కాపు రిజర్వేషన్ పోరాట సమితి కె ఆర్ పి ఎస్



విజయవాడ సెంట్రల్ సెప్టెంబర్ 13 (మనం న్యూస్ ): విజయవాడ కాపు తెలగ బలిజ ఒంటరి కులాల వారికి జరుగుతున్నా అన్యాయంపై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు శనివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కాపులకు జనాభా ప్రతిపాదికగా 12% బి.సి.లకు విద్య, ఉద్యోగాలలో 34% రిజర్వేషన్ లు ఓ.సి.లకు (ఉగిఖి )ఈ డబ్ల్యూ ఎస్ 10% రిజర్వేషన్ల కొనసాగించాలని కూటమి ప్రభుత్వం ద్వంద్వ నీతిని ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తున్నామని ప్రజా ప్రభుత్వం తల్లిదండ్రుల పాత్ర పోషించి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సమధర్మాన్ని సామాజికన్యాయాన్ని పాటించాలని విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు అందరికీ సమానంగా కల్పించాలి. సమాజంలో అందరూ బాగుండాలనీ అందులో కాపులుకూడా ఉండాలని అన్నారు. బి.సి. మరియు ఇతర ఓ.సి.లకు ఇబ్బంది లేకుండా కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలవారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలోనూ, స్థానిక సంస్థలలోనూ, నామినేటెడ్ పోస్టులలోనూ, నామినేటెడ్ వర్కులలోనూ జనాభా ప్రాతిపదికగా 12% ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి. మా జనాభా ప్రకారం మాకు ఎంతమాత్రం న్యాయం జరగడం లేదు. జనాభా ప్రాతిపదికగా మా వాటా మాకు ఇవ్వాలి .బి.సి.లకు జనాభా ప్రాతిపదికగా 34% రిజర్వేషన్లు అమలు చేస్తున్న తరుణంలో 12 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కాపులకు అమలు చేయడానికి గల ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. కుటమి ప్రభుత్వం ద్వంద నీతి విధానాలు సరికావని కాపులు మినహా ఇతర పేద ఓ.సి.లు బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య, వెలమ, కమ్మ, రెడ్డి తదితరుల లోని పేదలకు ఈ డబ్ల్యూ ఎస్ 10% రిజర్వేషన్లు కొనసాగించాలని ఎ.పి.లో జనాభా ప్రాతిపదికగా అందరికీ సమధర్మం, సమన్యాయం, సామాజికన్యాయం జరుగుతుందని ప్రభుత్వం స్పందించి అందరికీ సమన్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, రాష్ట్ర కో ఆర్డినేటర్ జానపాముల నాగబాబు, రాష్ట్ర కో కన్వీనర్స్ బోడపాటి పెదబాబు, కాకిలేటి హరనాథ్, సోషల్ జస్టిస్ ఫోరమ్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్ ఈ డబ్ల్యూ ఎస్ రాష్ట్ర కన్వీనర్ మాదిరెడ్డి వీర రాఘవరావు, వలవల శ్రీధర్ తదితరులు పాలుగొన్నారు.

# మేము సైతం.. సేవా సమయాన్ని పొదుపు చేస్తాం..

- టైమ్ బ్యాంక్ ఓ వినూత్న కార్యక్రమం
- ఒకరికి చేసే సేవతో వచ్చే సంతృప్తి వెలకట్టలేనిది.
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.



విజయవాడ సెంట్రల్, సెప్టెంబర్ 13 (మనం న్యూస్) సమాజంలో భాగమైన మనం సామాజిక బాధ్యతతో ఒకరికి చేసే సేవ వెలకట్టలేనిదని.. దేశంలోనే మొదటిసారిగా ఎన్టీఆర్ జిల్లాలో టైమ్ బ్యాంక్ - మేము కూడా పేరుతో ఓ వినూత్న కార్యక్రమాన్ని పైలట్ ప్రాతిపదికన అమలుచేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో టైమ్ బ్యాంక్ కార్యక్రమంపై యువ వాలంటీర్లకు వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యువ వాలంటీర్లు సమాజానికి ఏదో ఒక రూపంలో సేవ చేస్తే.. వారు ఎంత సమయం పాటు సేవ చేశారనే దాని ఆధారంగా ఆ సమయం టైమ్ బ్యాంక్లో కాయిన్ల రూపంలో జమవుతాయని.. వారు సంపాదించిన టైమ్ కాయిన్లను వాలంటీర్లు లేదా వారి కుటుంబ సభ్యులు అవసరమైనప్పుడు వినియోగించుకోవచ్చని వివరించారు. విశేష సేవలందించిన వాలంటీర్లకు డిజిటల్ సర్టిఫికేట్లు, మెరిట్ బ్యాడ్జీలు కూడా ప్రదానం చేయనున్నట్లు వివరించారు. టైమ్ బ్యాంకు కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా విజయవాడ రైల్వే స్టేషన్, పీఎన్ బస్టేషన్, ప్రధాన రైల్వే స్టేషన్లలో అమలుచేయనున్నట్లు తెలిపారు. నాలుగు వారాల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేసిన తరువాత వాలంటీర్ల అభిప్రాయాలను సేకరించి, అనంతరం మొత్తం జిల్లా మొత్తానికి ఈ వినూత్న విధానాన్ని అమలుచేయనున్నట్లు తెలిపారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించేందుకు, బంగారు భవిష్యత్తుకు నిర్మాతలుగా తీర్చిదిద్దేందుకు ఈ విధానాన్ని అమలుచేయనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి ఈ వినూత్న విధానం విధివిధానాలు, డిజిటల్ మానిటరింగ్, డ్యాష్బోర్డు, ఈ-సర్టిఫికేట్ తదితరాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అగిరిపల్లి)కి చెందిన 45 మంది విద్యార్థులతో పాటు డా. నాగసుధారాణి, డాక్టర్ శ్రీలత, వాసవ్య మహిళా మండలి వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# యూటీఎఫ్ తోట్ల వల్లూరు మండల అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక




ఉయ్యూరు సెప్టెంబర్ 13 (మనం న్యూస్): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తోట్లవల్లూరు మండల కౌన్సిల్ ఎన్నికలలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బిహిమ కుమారి ఎం విజయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ఎన్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉయ్యూరు లోని శ్రామిక భవనంలో ఎన్నికలు జరిగాయని అన్నారు. కౌన్సిల్ గౌరవఅధ్యక్షులుగా పి పి అహ్మద్ బాబు సహాధ్యక్షులుగా టి వెంకటేశ్వరరావు సిహెచ్ మైథిలి కోశాధికారిగా కె రమాదేవి కార్యదర్శులుగా వి మహాలక్ష్మి ఎం మురళీకృష్ణ జి పార్థసారథి పి అనూష ఎస్.కె రియాజ్ భాషా ఏ విష్ణువర్ధన్ జిల్లా కౌన్సిలర్లుగా ఐ విజయలక్ష్మి పి ఎన్ డి ప్రసాద్ పి కుసుమకుమారి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి పివి రమణ ఎన్నికైన వారందరికీ అభినందనలు తెలిపారు.

# నా టైం వేస్ట్ చేస్తున్నట్లే!.. నాటోపై ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, సెప్టెంబర్ 13 : రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై భారీ సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా నాటోను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటోదేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయడం తోపాటు, చైనాపై సుంకాలు విధించినప్పుడే ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగుస్తుందన్నారు. లేదంటే తన సమయంతోపాటు అమెరికా డబ్బునూ వృథా చేస్తున్నట్లేనని అన్నారు. మరోవైపు మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు చైనాపై 50 నుంచి 100శాతం సుంకాలు విధించాలన్నారు. నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటం షాక్కు గురిచేస్తోందని సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో ట్రంప్ పేర్కొన్నారు. ఈ చర్యలే రష్యాతో చర్చలు, బేరసారాల శక్తిని చాలా బలహీన పరుస్తున్నాయని చెప్పారు. ఇందుకు నాటో దేశాలపై విమర్శలు చేసిన ట్రంప్.. యుద్ధంలో విజయం సాధించాలనే పూర్తి నిబద్ధత వారిలో కనిపించడం లేదన్నారు. చమురుపై నాటో నిషేధంతోపాటు చైనాపై 50 నుంచి 100శాతం సుంకాలు విధించడం వంటి చర్యలు ఈ యుద్ధం ముగింపునకు దోహదపడతాయన్నారు. రష్యాపై బీజింగ్ పట్టు సాధించిందని.. సంకాలు విధించ డం ద్వారా దీన్ని బలహీనపర చవచ్చని అన్నారు. ఈ యుద్ధానికి మునుపటి అధ్యక్షుడు బైడెన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీలే కారణమని మరోసారి ఆరోపించారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై టారిఫ్లు విధించాలని ఈయూ, జీ7 దేశాలకు విజ్ఞప్తి చేసిన మరుసటి రోజే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి అత్యధిక స్థాయిలో చమురు కొనుగోలు చేస్తున్న దేశం చైనా. ఆ తర్వాతి స్థానంలో భారత్ ఉంది. మూడో స్థానంలో తుర్కియే ఉండగా.. అది నాటో కూటమిలో భాగం. ఇందులో సభ్యదేశాలుగా ఉన్న హంగేరి, స్లొవాకియా కూడా మాస్కో నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నాయి.

# రష్యాలో భారీ భూకంపం



మాస్కో, సెప్టెంబర్ 13 : రష్యాలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. కామ్చాట్కా తీరంలో రిక్టర్ స్కేల్ 7.4గా తీవ్రత నమోదైంది. ఈవిషయాన్ని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. 39.5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ మాత్రం 7.1 తీవ్రత ఉన్నట్లు పేర్కొంది. భూకంపం కారణంగా సునామీ వచ్చే అవకాశం లేదని పసిఫిక్ సునామీ హెచ్చరిక వ్యవస్థ ప్రకటన విడుదల చేసింది. జపాన్లో కూడా ఎలాంటి సునామీ హెచ్చరిక జారీ కాలేదు. ఇటీవలే కామ్చాట్కా తీరంలో 8.8 తీవ్రతతో భూకంపం సంభవించింది.

# కాంగోలో పడవ ప్రమాదాలు.. 193 మంది మృతి!

కాంగో, సెప్టెంబర్ 13 : డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో జరిగిన రెండు వేర్వేరు పడవ ప్రమాదాలు 193 మందిని బలి తీసుకున్నాయి. మరికొందరు గల్లంతయ్యారని ఆ దేశ మీడియా సహా అధికారులు పేర్కొన్నారు. ఈక్వెటార్ ప్రావిన్స్కు 150 కిలోమీటర్ల దూరంలో బుధ, గురువారాల్లో ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం లుకోలెలా భూభాగం నుంచి దాదాపు 500 మందితో ఓ పడవ బయలుదేరింది. మార్గ మధ్యలో ఉండగా అందులో మంటలు చెలరేగాయి. దీంతో ఆ పడవ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 107 మంది చనిపోయినట్లు కాంగో ప్రభుత్వం ప్రకటించింది. 209 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. మలాంగే గ్రామానికి చెందిన పడవ సాయంతో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 146 మంది గల్లంతయ్యారని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ పేర్కొంది.



అంతకుముందు రోజు బసాన్కుసు ప్రాంతంలో ఓ పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 86 మంది మృతి చెందారు. అందులో ఎక్కువమంది విద్యార్థులేనని తెలిసింది. మరికొందరు గల్లంతు కాగా.. కచ్చితమైన సంఖ్య వెల్లడి కాలేదు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. లోడింగ్, నావిగేషన్ వ్యవస్థలో లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పౌర సంఘాలు ఆరోపించాయి. విస్తారమైన వర్షారణ్య ప్రాంతాలతో కూడిన కాంగోలో నదీ రవాణా ఒక జీవనాడి. ఇక్కడి గ్రామాల మధ్య పాత చెక్క పడవల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు రవాణా కంటే జలరవాణా చౌక కావడంతో పడవలు కొన్నిసార్లు కిక్కిరిసిపోతుంటాయి.



## మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయం

- 'టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు.

తుగ్గలి సెప్టెంబర్ 13(మనం న్యూస్) నేపాల్ లో చిక్కుకున్న 215 తెలుగు వారు గురువారం క్షేమంగా రావడానికి కారణం మంత్రి నారా లోకేష్ తీసుకున్న చర్యలని తుగ్గలి టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు.శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ భయానికి, సంఘటనలు మధ్యలో తెలుగువారు నేపాల్ లో చిక్కుకొనిపోయారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ సభలు,సమావేశాలు ఉన్నప్పటికీ ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా చొరవ చూపారన్నారు.టీడీపీ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## కర్నూలు జిల్లాను అన్ని విధాలా

# అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా

### కర్నూలు జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన డా.ఏ.సిరి

కర్నూలు, సెప్టెంబర్ 13:- మనం న్యూస్ ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.

సెకండరీ హెల్త్ డైరెక్టర్ గా పనిచేస్తూ కర్నూలు జిల్లా కలెక్టర్ గా నియమితులైన డా.ఏ.సిరి శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో కర్నూలు జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి జిల్లా కలెక్టర్ కు ఆశీస్సులు అందచేశారు..

బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రధానంగా ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, అలాగే కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడం, జిల్లాలో త్రాగునీటి సమస్య ల పరిష్కారం, భూగర్భ జలాల పెంపు అంశాలపై కూడా దృష్టి పెడతామన్నారు.. ఓర్వకల్లు



ఇండస్ట్రియల్ నోడ్ ద్వారా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు.

అలాగే విద్యా రంగం అభివృద్ధి, ముఖ్యముగా గ్రామీణ ప్రాంతంలో విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పై కూడా దృష్టి పెడతామని, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరమ్మతు పనులు ఏమైనా ఉంటే, వాటిని చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు... పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. రెవెన్యూ కు సంబంధించిన భూ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మేలు జరిగేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.. తదనంతరం నూతన కలెక్టర్ కు జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్చాలతో జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు.



## అర్ధరాత్రి గుంతలు రోడ్డులో ఇరుక్కుపోయిన కర్ణాటక బస్సు

తుగ్గలి సెప్టెంబర్ 13 (మనం న్యూస్): మండల పరిధిలోని రాతన గ్రామంలోనే మంత్రాలయం బెంగళూరు రహదారి పై కర్ణాటక బస్సు రోడ్డులో ఇరుక్కుపోవడం జరిగింది. దీంతో ప్రయాణికులు తెల్లవారుజామున రెండు గంటల నుండి ఇప్పటిదాకా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఏ అధికారి ఈ విషయంపై పట్టించుకోవడం లేదు. రోడ్లు దెబ్బతిన్నాయని పలుసార్లు దినపత్రికల్లో వార్తలు వస్తున్నప్పటికీ అధికారులు నిమ్మక నేరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. నిత్యం వేలాదిమంది బెంగళూరు నుండి మంత్రాలయం కు ప్రతిరోజు వెళుతున్నారు. అంతేకాక చెన్నై నుండి బొంబాయి కూడా ఈ మార్గం గుండే రోజు వందల వాహనాలు వెళుతున్నాయి. ఇలాంటి రహదారి పై రాతన రోడ్డులో గుంతలు పడ్డాయని ఎన్నో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన, వివిధ దినపత్రికలలో వార్తలు వచ్చిన, ఏ అధికారి వీటి గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకొని అక్కడున్న రోడ్డుకి మరుమతులు చేపట్టాలని వాహన చోదకులు,గ్రామ ప్రజలు కోరారు.



## విద్యార్థులకు క్రీడా దుస్తువులు పంపిణీ

మంత్రాలయం , సెప్టెంబర్ 13,మనం న్యూస్ : మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి 30 జతలు క్రీడా దుస్తులను శనివారం ఎమ్మిగనూరు లో ని భీమ నిలయంలో అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు.భవిష్యత్తులో జరగబోయే టోర్నమెంట్స్ లో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వారు అభినందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు , ఉపాధ్యాయులు వై ప్రదీప్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అభివృద్ధికి కృషి

- ఉమ్మడి జిల్లాలో 550 కోట్ల బకాయిలు రికవరీ కి చర్యలు



కర్నూల్ సెప్టెంబర్ 13( మనం న్యూస్ బ్యూరో): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు శనివారం కర్నూల్ శివారులోని హోటల్ లో జరిగిన ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ పరపతి సంఘాల చైర్మన్ ల సమావేశం జరిగింది ఈ సందర్భంగా టీడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి నంద్యాల జిల్లా అధ్యక్షులు టిటిడి పాలక మండల సభ్యులు మల్లెల రాజశేఖర్ ఉమ్మడి జిల్లాల మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వై నాగేశ్వర యాదవ్ కె డి సి సి బ్యాంక్ కే డి సి సి బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 99 సహకార పరపతి సంఘాలకు గాను 46 సహకార పరపతి సంఘాలలో రుణాల రికవరీ జరిగిందని మిగిలిన వాటిలో 53 శాతం రికవరీ కావలసి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 550 కోట్ల రూపాయలు బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు ఈ బకాయిలను వసూలు చేసేందుకు వ్యవసాయ పరపతి సహకార సంఘాల చైర్మన్లు అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు గతంలో వైసిపి ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో పలు సహకార సంఘాలలో వైసీపీ నాయకులు బ్యాంకు నిధులను స్వాహా చేశారన్నారు వాటిని వసూలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు అందులో భాగంగానే సమర్థులైన కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ లను నియమించారన్నారు . టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ తిక్క రెడ్డి మార్కెటింగ్ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి సమర్థులైన నాయకులు కాబట్టే ఆయనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్గా నియమించారన్నారు విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలు మరింత అభివృద్ధి చెందుతాయని అందితే అంతేగాక బకాయిల వసూలు చేయడంలో కూడా కే డి సి సి బ్యాంక్ చైర్మన్ గట్టి కృషి చేస్తారన్నారు ఈ సమావేశంలో వివిధ వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు



## మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం

- గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి.....
- మైదాన ప్రాంత గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలి
- ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప
- గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి...

కర్నూలు సెప్టెంబర్ 13 మనం న్యూస్ : మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని,మైదా న ప్రాంత గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని శనివారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అనంతరత్నం,గిరిజన సంఘాల చైర్మన్ రామస్వామి, లంబడా జాతీయ అధ్యక్షులు యోగేష్ నాయక్ లు మాట్లాతూ రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. మైదాన ప్రాంత గిరిజన తెగలలో ప్రధానంగా ఎరుకలి,సుగాలి, చెంచు, యానాది ఇలా అనేక జాతులు ఉన్నారన్నారు వీరందరికీ సరైన సమాన ప్రాతినిధ్యం లేదన్నారు. రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగిపోయిందన్నారు. ఇకనైనా మేలుకొని మన హక్కులను కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరాటం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి నోచక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు. 2026 సంవత్సరంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాలలో రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజికంగా, ఆర్థిక, రాజకీయ ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుశలన్న పాల్గొన్నారు.



## కర్నూలు జిల్లా నూతన కలెక్టర్

- మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ


కర్నూలు సెప్టెంబర్ 13 మనం బ్యూరో :కర్నూలు జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి కర్నూల్ నగరంలోని స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ లో శనివారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు .



## వీఆర్ఏల వేతనాలు పెంచాలి

- వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి. శేఖర్

తుగ్గలి సెప్టెంబర్ 13(మనం న్యూస్): వీఆర్ఏలకు వేతనాలు పెంచాలని, వారి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం తుగ్గలి తహశీల్దార్ కార్యాలయం నందు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల ఉపాధ్యక్షులు సూర్యనారాయణ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శేఖర్ సమావేశంలో మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా వీఆర్ఏలకు జీతాలు పెంచుకోవడం దారుణమన్నారు. వీఆర్ఏలను రెగ్యులర్ విఆర్ఎల్ గా గుర్తించాలని, అర్హులైన వారికి నాలుగో తరగతి ఉద్యోగులుగా పదోన్నతులు ఇవ్వాలని,జాబ్ చాట్ లో లేని పనుల నుంచి వీఆర్ఏలను మినహాయించాలని,010 జీవో కింద జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన గ్రామ రెవెన్యూ సహాయకులకు వీఆర్వో, ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులకు ప్రమోషన్ కల్పించాలని, వయసు పైబడిన వీఆర్ఏల స్థానంలో వారి విధులు నిర్వహిస్తున్న వారి వారసులను రెగ్యులర్ వీఆర్ఏలుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పై డిమాండ్స్ ను చర్చించి న్యాయం చేయాలని డిమాండ్స్ను పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల నాయకులు హంపయ్య, నాగేష్, నరసింహ,రాజు, మధు, శ్రీవాసులు, మండల వీఆర్ఏలు రంగన్న,రామలక్ష్మి,రాము, మహేంద్ర పాల్గొన్నారు.




## నేడు 14న ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశం..

- 'నూతన కమిటీ ఎన్నిక పాత్రికేయులు హాజరు కావాలి...
- 'ఏపీడబ్ల్యూజేఎఫ్ సంఘం.

పత్తికొండ సెప్టెంబర్ 13(మనం న్యూస్) పత్తికొండలో పట్టణంలోనే (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నియోజకవర్గ విస్తృతస్థాయి ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగలింగన్న, అధ్యక్ష కార్యదర్శులు చిన్నారెడ్డి, రాముడు, కోశాధికారి ఎం శ్రీనివాసులు శనివారం విలేకరులకు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఏపిడబ్ల్యుజే ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, బి శ్రీనివాసులు,హుస్సేన్ హాజరవుతున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పాత్రికేయులు హాజరుకావాలని వారు తెలిపారు.

## ప్రజల వద్దకు తపాలా సేవలు

- జిల్లా తపాలా ఎస్పీ జనార్ధన్ రెడ్డి



మంత్రాలయం , సెప్టెంబర్ 13, మనం న్యూస్ :- తపాల శాఖలో నూతన టెక్నాలజీ పరిజ్ఞానంతో రూపొందించిన ఐయంఏ 2. ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తపాల సేవలను అందిచడం జరుగుతుందని కర్నూలు జిల్లా పోస్టల్ యస్పీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలం పరిధిలోని తుంగభద్ర లోని ఉప తపాల కార్యాలయాన్ని సందర్శించి, అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తపాల శాఖలో ఇప్పటికే తక్కువ ప్రిమియం, ఎక్కువ బోనస్ తో పాటు తపాల బీమా,ఐపిపిబి ద్వారా ఖాతాలు తెరవడం, ఏఇపియస్ ద్వారా విత్ డ్రా చేయడం, వివిధ రకాల పాలసీలు, ఖాతాదారులకు అందిస్తుమన్నారు. వీటితో పాటు నూతన సంకేతం పరిజ్ఞానం తో 2.0 ఖాతాదారులకు మెరుగైన సేవలను మీ ఇంటి దగ్గరకే వచ్చి సేవలు అందిచడం జరుగుతుందన్నారు. వివిధ రకాల సేవలు ప్రజలకు అందించాడానికి ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి , బిపియంలు , ఎబిపియంల , ఎమ్మిగనూరు సబ్ డివిజన్ అధికారి నాగరాజు,యస్పీయం రమేష్,యంఓ దివాకర్, రంగారెడ్డి,గోవిందు,శంకర్‌రెడ్డి, పునీత్, మౌనిక, అమృత, తేజస్వీని, యశ్వంత్,కృష్ణ, సుమన్,ఖాదర్ భాషా, తిమ్మప్ప తదితరులున్నారు.

## ప్రజలకు అండగా సీఎం సహాయ నిధి

- బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత
- మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి



మంత్రాలయం , సెప్టెంబర్ 13, మనం న్యూస్ :- ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రజలకు అత్యవసర సమయంలో వరంలా మారిందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి ,నాలుగు మండల తెదేపా నాయకులతో కలిసి 40 కుటుంబాలకు గాను రూ. 15,77,420 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు అందుకోలేని పరిస్థితి లో సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి ఇంటి పెద్ద కొడుకుగా అండగా ఉంటానని ఎన్నికలలో ఇచ్చిన హామీని మన చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారన్నారు. ఈ సహాయాన్ని కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు , మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు కోసిగి ముత్తురెడ్డి, మండల అధ్యక్షులు రామిరెడ్డి, ఆడివప్పగౌడ్, బసలదొడ్డి ఈరన్న , టీడీపీ యువ నాయకులు ఎన్. రాకేష్ రెడ్డి , హనుమంతురెడ్డి, టి.బి.పి చైర్మన్ టిప్పుసుల్తాన్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, మంచాల సొసైటీ డైరెక్టర్లు డీసీ తిమ్మప్ప , చాపల నాగేష్ , కురువ ఈరన్న , భూషణ్ గౌడ్, సతీష్ నాయుడు రాజశేఖర్, హల్వి హనుమంతు, మంత్రాలయం టీడీపీ టౌన్ ఇన్చార్జి వరదరాజు, బసవరాజు, చంద్రప్ప గౌడ్, నరసింహ తదితర గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తంగడంచ గ్రామంలో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించిన డీఎస్పీ

జూపాడుబంగ్లా సెప్టెంబర్ 13 (మనం న్యూస్) నంద్యాల జిల్లా: ఉన్నతాధికారుల సూచనల మేరకు జూపాడు బంగ్లా మండలం, తంగడంచ గ్రామంలో ఆత్మకూరు డి ఎస్ పి రామాంజి నాయక్ ఆధ్వర్యంలో, నందికొట్కూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టీ. సుబ్రమణ్యం మరియు జూపాడుబంగ్లా ఎస్సు కె. మల్లికార్జున, అధ్యక్షతన గ్రామ పెద్దలతో కలిసి గ్రామ సభ నిర్వహించడం జరిగింది.

గ్రామసభ సందర్భంగా భూ వివాదాలు, మతపరమైన సమస్యలు, శాంతిభద్రతల నిర్వహణ, మరియు రహదారి భద్రత, బాల్య వివాహాల నివారణ, పోక్సో కేసులు, మహిళలపై నేరాలు మరియు సైబర్ క్రైమ్ సమాచారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరికైనా ఇలాంటి ఇబ్బందులు కలిగిన సంబంధిత జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో కానీ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 100, 112, 1930 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిన వెంటనే తక్షణమే వచ్చి మీ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని టోల్ ఫ్రీ నెంబర్ల గురించి కూడా అవగాహన కల్పించారు. సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడే లేదా ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎవరైనా భూమి తగాదాలు ఉన్నట్లయితే ఘర్షణలకు గురి కాకుండా చట్టపరంగా రెవెన్యూ శాఖను గాని. కోర్టుల ద్వారా గాని. పరిష్కారం చేసుకొని శాంతియుతంగా నడవాలని ఆయన ఆదేశించడం జరిగినది రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్క యువకులు హెల్మెట్ ధరించి ప్రాణాలు నిలుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొనడం జరిగినది.

## బీసీసీఐ అధ్యక్షుడి రేసులో భజ్జీ..!



భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది. అధ్యక్షుడి పదవి సహా కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు ఎలక్షన్స్ జరుగనున్న నేపథ్యంలో పలువురు పేర్లు తెరపైకి వస్తున్నాయి. ప్రెసిడెంట్ పదవి కోసం టీమిండియా దిగ్గజం సచిన్ టెండూల్కర్ పోటీ చేస్తారనే కథనాలు వినిపించాయి. కానీ, మాస్టర్ బ్లాస్టర్ విముఖత చూపినట్టు సమాచారం. తాజాగా బీసీసీఐ అధ్యక్షుడి రేసులో ఉన్నాడంటూ మరో వెటరన్ పేరు ఇప్పుడు నెట్టింట వైరలవుతోంది. అతడు ఎవరో కాదు.. మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్లో సుదీర్ఘ అనుభవం కలిగిన హర్భజన్ సింగ్ ప్రస్తుతం కామెంటేటర్గా కొనసాగుతున్నారు. పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న భజ్జీ బీసీసీఐ అధ్యక్ష పదవిపై ఆసక్తితో ఉన్నాడని టాక్. టీమిండియా లెజెండరీ స్పిన్నర్ అయిన అతడిని ఈసారి బరిలోకి దింపాలని పంజాబ్ క్రికెట్ సంఘం భావిస్తోంది. సెప్టెంబర్ 28న జరుగబోయే ఎన్నికలకు భజ్జీని నామినేట్ చేయాలని పీసీఏ పావులు కదుపుతోంది.ప్రతి రాష్ట్రం ఒక మాజీ ఆటగాడిని నామినేట్ చేసేందుకు వీలుంటుంది. సెప్టెంబర్ 20-21 తేదీల్లో నామినేషన్లను స్వీకరిస్తామని బీసీసీఐ ఎన్నికల అధికారి ఏకే జోతి తెలిపాడు. సో.. వచ్చే వారంలో ఆసక్తిగల అభ్యర్థుల జాబితా రానుంది. దాంతో.. అప్పుడుగానీ ప్రెసిడెంట్ పోటీలో ఉండేది ఎవరు? అనే విషయంపై స్పష్టత వస్తుంది. అయితే.. తాను బీసీసీఐ అధ్యక్ష పదవి రేసులో ఉన్నాననే విషయాన్ని హర్భజన్ ఇంకా ధ్రువీకరించలేదు.



## భారత్ 2 న్యూజిలాండ్ 0

న్యూజిలాండ్‌తో డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్-1 పోరులో భారత్ శుభారంభం చేసింది. అరంగేట్ర ఆటగాడు దంత్తా చాటడంతో శుక్రవారం రెండు సింగిల్స్ మ్యాచ్లోనూ భారతే గెలిచింది. తొలి సింగిల్స్లో దక్షిణేశ్వర్ 7-6 (7-5), 6-3తో జెరోమ్ కిమ్ను కంగుతినిపించాడు. అనుభవం లేని దక్షిణేశ్వర్ ఈ మ్యాచ్లో అనూహ్య ప్రదర్శన చేశాడు. బలవైన సర్వీసులతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టాడు. నెట్ గేమ్లోనే ఎక్కువ పాయింట్లు సాధించాడు. కిమ్ కూడా పుంజుకోవడంతో సెట్ టైబ్రేకర్కు మళ్లింది. టైబ్రేకర్లో సర్వీసులతో విజృంభించిన దక్షిణేశ్వర్ తొలి సెట్ను కైవసం చేసుకున్నాడు. రెండో సెట్లో మరింత ఆత్మవిశ్వాసంతో ఆడిన భారత కుర్రాడు 5-3తో ఆధిక్యంలో నిలవడమే కాక.. అదే జోరుతో సెట్తో పాటు మ్యాచ్ను కైవసం చేసుకున్నాడు. సింగిల్స్‌లో కిమ్ ర్యాంకు 179 కాగా.. దక్షిణేశ్వర్ 626వ ర్యాంకులో ఉండడం గమనార్హం. రిజర్వ్ ఆటగాళ్లలో ఉన్న దక్షిణేశ్వర్‌ను ఇటీవల మెరుగైన ప్రదర్శన కారణంగా నేరుగా సింగిల్స్ ఆడే అవకాశం కల్పించాడు కెప్టెన్ రాజ్పాల్. ఆ నమ్మకాన్ని దక్షిణేశ్వర్ వమ్ము చేయలేదు. రెండో సింగిల్స్లో సుమిత్ నగాల్ 6-3, 7-6 (7-4)తో మార్క్ హస్లర్ను ఓడించాడు. తొలి సెట్ను తేలిగ్గానే గెలిచిన నగాల్కు రెండో సెట్లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైంది. ఈ సెట్ను అతడు టైబ్రేకర్లో గెలిచి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. శనివారం డబుల్స్ పోరులో రిత్విక్ బొల్లిపల్లి-శ్రీరామ్ బాలాజీ జంట జాకబ్ పాల్-డొమినిక్ స్ట్రీకర్ ద్వయంతో తలపడనుంది. భారత ఐరోపా జట్టుపై విదేశాల్లో చివరగా 1993లో నెగ్గింది. లియాండర్పేస్, రమేశ్ కృష్ణన్లతో కూడిన జట్టు డేవిస్ కప్ క్వార్టర్స్‌లో అప్పుడు ఫ్రాన్స్‌పై 3-2తో గెలిచింది.



## ఫిట్‌నెస్ టెస్టులో పాస్

మహిళల వన్డే వరల్ కప్ ముందు భారత జట్టుకు గుడ్న్యూస్. కొన్నిరోజులుగా జట్టుకు దూరమైన ప్రధాన పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ ఫిట్నెస్ సాధించింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో గాయపడిన రేణుకా ఈమధ్యే వైద్య పరీక్షలతో పాటు ఫిట్నెస్ పరీక్షలోనూ పాసైంది. దాంతో.. వరల్ కప్ సన్నాహక సిరీస్ అయిన ఆస్ట్రేలియా పర్యటనలో ఈ స్పీడ్‌స్టర్ బరిలోకి దిగనుంది. ఈ విషయాన్ని శనివారం కోచ్ అమొల్ మజుందార్ వెల్లడించాడు.'రేణుకా సింగ్ జట్టుతో కలిసి నెట్స్ సెషన్లో పాల్గొంది. మహిళల ప్రీమియర్ లీగ్ మూడో సీజన్లో గాయపడిన ఆమె ఈమధ్యే కోలుకుంది. ఫిట్నెస్ టెస్టుతో పాటు వైద్య పరీక్షల్లోనూ ఆమె పాసైంది. భారత జట్టులో రేణుక చాలా కీలకమైన ప్లేయర్. పేస్, మీడియం పేస్ దళానికి ఆమెనే నాయకురాలు. చెప్పాలంటే తను టీమిండియాలో అంతర్భాగం' అని మజుందార్ తెలిపాడు.గత కొంత కాలంగా రేణుకా భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. పవర్ ప్లేలో వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలో పడేస్తూ.. జట్టుకు ఇప్పటివరకూ 19 వన్డేలు ఆడిన రేణుకా 4.85 ఎకానమీతో 35 వికెట్లు పడగొట్టింది. ఒకసారి ఐదు వికెట్లు, మరోసారి నాలుగు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టింది పేస్ గన్.

## పసిడి పోరుకు జైస్మీన్, నుపుర్



ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జైస్మీన్ లాంబోరియా, నుపుర్ షెరాన్ అదరగొట్టారు. జోరు కొనసాగిస్తూ ఫైనల్ దూసుకెళ్లి పసిడికి అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం మహిళల 57 కేజీల సెమీస్లో జైస్మీన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనిజువెలా)ను చిత్తు చేసింది. ఫైనల్లో ఆమె పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జులియా (పోలెండ్)ను ఢీకొంటుంది. మరో సెమీస్లో నుపుర్ షెరాన్ (80 కేజీల విభాగం) 5-0తో డుజ్గున్ సెమ (తుర్కియే)ను ఓడించింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన నుపుర్ ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. మరోవైపు మీనాక్షి హుడా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసింది. 48 కేజీల క్వార్టర్‌ఫైనల్లో అండర్-19 ప్రపంచ ఛాంపియన్ అలిస్ పామ్ఫోరి (ఇంగ్లాండ్)ను మీనాక్షి చిత్తు చేసింది. ఈ బౌట్లో తన ఎత్తును ఉపయోగించుకుంటూ ఆమె తెలివిగా ఆడింది. బ్యాక్‌ఫుట్‌పైనే ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌లో ప్రత్యర్థి పంచ్లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో స్థానం కోసం అల్టాంట్ (మంగోలియా)తో భారత బాక్సర్ అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు పురుషుల్లో జాదుమణి సింగ్ పోరాటం ముగిసింది. 50 కేజీల క్వార్టర్స్లో ప్రపంచ ఛాంపియన్ సాన్జార్ (కజకిస్తాన్) చేతిలో జాదుమణి పోరాడి ఓడిపోయాడు. దీంతో పురుషుల్లో భారత్ పోటీ ముగిసింది. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించలేక పోవడం ఇదే తొలిసారి.



## దసరాకి ప్రారంభం!

'వీరసింహారెడ్డి' విజయం తర్వాత కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలిసి మరో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. 'ఎన్బీకే 111' వర్కింగ్ టైటిల్తో పట్టాలెక్కనున్న ఈ చిత్రాన్ని వెంకట సతీశ్ కిలారు నిర్మించనున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని దసరా పండగ సందర్భంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. చరిత్రను.. భారీ యాక్షన్‌ను ముడిపెట్టి ఓ వినూత్నమైన ఎపిక్ స్టోరీతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు.. బాలయ్య ఇందులో మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నట్లు చిత్ర బృందం ఇది వరకు ప్రకటించింది. బాలయ్య ప్రస్తుతం ఈ సినిమాతో పాటు దర్శకుడు క్రిష్ జాగర్లమూడితోనూ ఓ చిత్రం చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీనిపైనా విజయ దశమికి స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు సమాంతరంగా చిత్రీకరణ చేసుకోనున్నట్లు తెలుస్తోంది.

## అనుష్క బాటలో ఐశ్వర్య



సినీ తారలు ఒక్కోకరిగా సోషల్ మీడియాకు దూరమవుతున్నారు. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి తాను సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకోబోతున్నట్లు శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అనుష్క ప్రకటించిన కొద్ది గంటల్లోనే తాజాగా మరో నటి సోషల్ మీడియా నుంచి దూరం అవుతున్నట్లు తెలిపింది. తమిళ నటి ఐశ్వర్య లక్ష్మి తాజాగా సోషల్ మీడియాకు పూర్తిగా దూరమవుతున్నట్లు ప్రకటించింది. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే సోషల్ మీడియా తప్పనిసరి తాను మొదట్లో అనుకున్నానని.. కానీ కాలంతో పాటు మనము కూడా అప్డేట్ అవ్వాలన్న ఆలోచన తనను ఎంతగానో ప్రభావితం చేసిందని ఐశ్వర్య తెలిపింది. అంతేగాకుండా ప్రస్తుతం ఉన్న పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని.. తాను సోషల్ మీడియాకు బానిసగా మారిపోయానని అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నటి తెలిపింది. ఈ సందర్భంగా ఇన్స్టా వేదికగా ఒక పోస్ట్ పెట్టింది.నేను నా పని, పరిశోధనలపై దృష్టి పెట్టకుండా, సోషల్ మీడియా నా ఆలోచనలను దారి మళ్లించింది. సోషల్ మీడియా వలన నాలోని క్రియేటివిటీ పోయింది. నాలో నెగిటివిటీని పెంచడమే కాకుండా ఒక సర్కిల్లో లాక్ అయ్యేలా చేసింది. నాకు నేను ఏదో ఒక సూపర్ నెట్గా మారిపోవడం నాకు ఇష్టం లేదు. ఒక మహిళగా, నేను చాలా కష్టపడి నన్ను నేను మెరుగుపరుచుకున్నాను, కానీ సోషల్ మీడియాకి లొంగిపోవడానికి నేను ఇష్టపడలేదు. ప్రపంచం నన్ను మర్చిపోతుందనే రిస్కుకు నేను సిద్ధంగా ఉన్నాను. నాలోని కళాకారిణిని, నాలో ఉన్న చిన్న పాపని కాపాడుకోవడానికి నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. నేను ఇంటర్నెట్ నుండి పూర్తిగా అదృశ్యమవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. భవిష్యత్తులో మరింత అర్థవంతమైన బంధాలను, మంచి సినిమాలు చేయాలని ఆశిస్తున్నాను. నేను నిజంగా మంచి సినిమా చేస్తే, మీరు పాత తరహాలోనే ప్రేమను పంచుతారని ఆశిస్తున్నానంటూ ఐశ్వర్య రాసుకొచ్చింది.

## మీరు నా కుటుంబాన్ని నిలబెట్టారు

### మంచు మనోజ్ ఎమోషనల్ స్పీచ్






తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన 'మిరాయ్' భారీ విజయాన్ని అందుకుంది. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో కనిపించిన ఈ సినిమా తొలిరోజు రూ.27 కోట్లు వసూలు చేసింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. అందులో మనోజ్ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తనను నమ్మిన దర్శక నిర్మాతలకు రుణపడి ఉంటానన్నారు. ''ఈరోజు ఎంతో ఆనందంగా ఉంది. 12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తొ నా ఫోన్ మోగుతూనే ఉంది. అభినందనలు వస్తున్నప్పటికీ నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసినందుకు కార్తిక్‌కు జన్మంతా రుణపడి ఉంటాను. ఇంతకుముందు నేను ఎక్కడికి వెళ్లినా 'అన్నా సినిమా ఎప్పుడు తీస్తావు. కమ్బ్యాక్ ఎప్పుడు?' అని అందరూ అడిగేవారు. త్వరలోనే వస్తాను అని చెప్పేవాడిని. వాళ్లతో బయటకు ధైర్యంగా మాట్లాడినా.. లోపల తెలియని భయం ఉండేది. చాలా సినిమాలు చివరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యాయి. ఒకటి అనుకుంటే మరోటి అయ్యేది. అలాంటి టైమ్‌లొ కార్తిక్ నన్ను నమ్మడం నా అదృష్టం. మీరు నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నాతో పాటు నా కుటుంబాన్ని కూడా నిలబెట్టారు'' అని దర్శకుడు కార్తిక్‌కు మంచు మనోజ్ థాంక్స్ చెప్పారు. తన పిల్లల విషయంలో ఎప్పుడూ భయం ఉండేదని మనోజ్ తెలిపారు. ''నేను పెరిగినట్లు నా పిల్లల్ని పెంచగలనా అని ఎప్పుడూ భయపడుతూ ఉండేవాడిని. ఆ భయాన్ని కార్తిక్ తీసేశారు. నిర్మాత కూడా ఎంతో ధైర్యంగా దీన్ని పూర్తిచేశారు. ' 'మిరాయ్' వీఎఫ్ఎక్స్ టీమ్ తెలుగు సినిమా గర్వపడేలా చేసింది. ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ప్రతి ఇంట్లో నుంచి మనోజ్ గెలవాలి అని కోరుకున్న వారందరికీ పేరుపేరునా పాదాభివందనం.



## విజయ్ దేవరకొండని కలిసిన 'లిటిల్ హార్ట్స్' టీమ్

చిన్న సినిమాగా వచ్చి టాలీవుడ్లో సూపర్ హిట్ అందుకున్న 'లిటిల్ హార్ట్స్' చిత్రంపై టాలీవుడ్ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అగ్ర కథానాయకులు అల్లు అర్జున్, నాని, అక్కినేని నాగ చైతన్య, సుమంత్ వంటి పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు. తాజాగా యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ కూడా 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందాన్ని కలుసుకున్నారు. ఈ సినిమా చూసిన తర్వాత విజయ్ దేవరకొండ.. దర్శకుడు సాయి మార్తాండ్‌తో పాటు హీరో మౌళి తనుజ్, హీరోయిన్ శివానీలను అభినందించినట్లు తెలుస్తోంది. అనంతరం విజయ్ తన క్లాతింగ్ బ్రాండ్ అయిన రౌడీ బట్టలను హీరో మౌళికి గిఫ్ట్‌ని ఇచ్చాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవు తున్నాయి. యూట్యూబర్ మౌళి తనుజ్, శివానీ నాగారం ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సాయి మార్తండ్ దర్శకత్వం వహించగా.. ఆదిత్య హాసన్ నిర్మించారు. రాజీవ్ కనకాల, అనితా చౌదరి, సత్య కృష్ణన్ వంటి నటులు కూడా ఇందులో ముఖ్య పాత్రలు పోషించారు.

## అంత బాధలోనూ వారు భోజనం పెట్టారు: సోనూ సూద్



నటుడిగా ఒకవైపు సినిమాలతో అలరిస్తూనే ఎంతో మంది నిరుపేదలకు తనవంతు సాయం చేస్తున్నారు సోనూసూద్ . ముఖ్యంగా కొవిడ్-19 సమయంలో ఆయన అందించిన సేవలను మర్చిపోలేం. ఆ తర్వాత పలు సమయాల్లోనూ తన దాతృత్వాన్ని చాటారు. ప్రస్తుతం పంజాబ్ను వరదలు ముంచెత్తాయి. రాష్ట్రంలో పలు గ్రామాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. తాజాగా సోనూసూద్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి ప్రజలు, రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు, అన్నం పెట్టే రైతన్నకు అండగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. వరద ప్రభావం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా, ఆ కుటుంబాలు తనని ఎంతో ఆప్యాయంగా పలకరించాయని, ఆ సమయంలోనూ కొందరు వరద బాధితులు తమకు ఆహారం, టీ అందించారని అన్నారు. అది తన హృదయాన్ని ఎంతో కదిలించిందన్నారు. వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆదుకోవాలని, అన్నదాత రుణం తీర్చుకుందామని ఈ సందర్భంగా సోనూసూద్ పిలుపునిచ్చారు. ''ఈ రోజు ఉదయం నుంచి అనేక వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించాం. రైతులను పలకరించడానికి ఎక్కడకు వెళ్లినా 'భోజనం చేస్తారా? టీ తాగుతారా? పాలు తీసుకుంటారా' అంటూ అడిగారు. ఈ దేశానికి ఆహారం అందిస్తున్న రైతన్న గురించి ఆలోచించండి. వాళ్ల పంటలు నీట మునిగి పోయాయి. కొన్ని రోజులకు వరద నీరు తగ్గవచ్చు. కానీ, వాళ్ల కనీస అవసరాలు పెరిగిపోతున్నాయి. మనందరం కలిసి కట్టుగా ముందుకు రావాల్సిన సమయం. వాళ్లకు తగిన సాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. మనకు అన్నం పెడుతున్న వాళ్ల రుణం తీర్చుకోవాలి' అని ఇన్స్టా వేదికగా పేర్కొన్నారు.

## జరిగిందొకటి.. చూపిందొకటి.. : మంచు లక్ష్మి

నటి మంచు లక్ష్మి ఇటీవల నిషేధిత బెట్టింగ్ యాప్లకు ప్రచారం చేసిన వ్యవహారంలో ఈడీ విచారణకు హాజరైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. దర్యాప్తు జరిగిన దాన్ని పక్కనపెట్టి మీడియా మరోదాన్ని హైలైట్ చేసిందని అసహనం వ్యక్తం చేశారు.''ఈ కేసులో చిట్టచివరి వ్యక్తిని విచారించాలని వారు భావించడం హాస్యాస్పదంగా ఉంది. అసలు ఇది ఎక్కడ మొదలైందనే దానిపై వారు దృష్టిపెట్టాలి. ఈ విచారణ అంశంపై మీడియాలో నాపై వచ్చిన వార్తలు చూసి చాలా బాధపడ్డాను. ఎందుకంటే మేం విచారణ ఒక విషయంలో ఎదుర్కొంటే.. మీడియా మరోదాన్ని హైలైట్ చేసింది. ఈ బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో డబ్బు ఎలా సమకూరుతోంది.. ఎక్కడికి వెళ్తోంది.. అనే విషయంపై వారు దర్యాప్తు చేస్తున్నారు. ఉగ్రవాదులకు నిధులు వెళ్తున్నాయా.. అనే దానిపై కూడా దృష్టిపెట్టారు. నాకు ఇవేవీ తెలియదు. 100 మంది ఈ బెట్టింగ్ యాప్స్ను ప్రమోట్ చేశారని తెలిపారు. ఆ జాబితాలో నేనూ ఉన్నానని చెప్పారు. అందుకే నేను విచారణకు వెళ్లాను. ఇదంతా ఒక్క నిమిషం పని'' అని మంచు లక్ష్మి అన్నారు. అసలు ఈ యాప్లు ఎక్కడ ప్రారంభమవుతున్నాయి. వీటి ఉనికి ఏంటి అనే పెద్ద సమస్యను అధికారులు ఎందుకు పరిష్కరించడం లేదని ఆమె ప్రశ్నించారు.బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసిన వ్యవహారంలో పలువురు సినీ ప్రముఖులు ఆగస్టులో ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆగస్టు 13న మంచు లక్ష్మిని అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో నటులు ప్రకాశ్రాజ్, విజయ్ దేవరకొండ, రానాలను ఈడీ ప్రశ్నించిన సంగతి తెలిసిందే.


Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.